ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

శుక్రవారం 8 నవంబరు 2024





> ఆధునిక వనరులతో.. అమరావతిని నెంబర్ వన్ సిటీగా చేసే బాధ్యత నాది. నిర్దిష్ట కాల పరిమితి పెట్టుకుని అమరావతిని అభివృద్ధి చేస్తా. ప్రపంచస్థాయి నగరాల్లో ఉండే సదుపాయాలు కల్పిస్తాను. భూగర్భ విద్యుత్ లైన్లతో అద్భుత నగరాన్ని రెండేళ్లలో సాక్షాత్కరించి రాష్ట్ర ప్రజలకు అందిస్తా. మహిళలు రాజధానిని కాపాడి, నిలబెట్టారు. వారి స్ఫూర్తితో అమరావతిని అద్భుత నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాను.
>
> \- ముఖ్యమంత్రి చంద్రబాబు

ఆధునికంగా.. అమరావతి

- ప్రపంచ స్థాయి నగర నిర్మాణం
- నిర్దిష్ట కాల పరిమితితో రాజధాని అభివృద్ధి
- సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవ సభలో సీఎం చంద్రబాబు నాయుడు



సమావేశంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



అధికారులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

గుంటూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం తాళ్లాయపాలెంలో 400/220 కేవీ సబ్‌స్టేషన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం ప్రారంభించారు. ఫొటోగ్యాలరీని పరిశీలించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. అనంతరం అక్కడి నుంచే వివిధ జిల్లాల్లో ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌మిషన్ లైన్ల ప్రారంభోత్సవాలు, 15 ప్రాంతాల్లో సబ్‌స్టేషన్లకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. 2014లో రాజధాని అవసరాల కోసం తాళ్లాయపాలెంలో సబ్‌స్టేషన్‌కు శ్రీకారం చుట్టగా ఐదేళ్ల వైసీపీ విధ్వంసక పాలనలో అది మరుగున పడిపోయిందన్నారు. అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లో తిరిగి దానిని పూర్తిచేసి ప్రారంభించామన్నారు. రూ.509 కోట్లతో ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్‌తో సీఆర్డీఏ భవిష్యత్ అవసరాలతో పాటు రాజధానిలోని పారిశ్రామిక అవసరాలు కూడా తీరుతాయన్నారు. గన్నవరం సబ్‌స్టేషన్‌తో రైతులకు విద్యుత్ అందజేయడం తోపాటు, అంతర్జాతీయ (మిగతా 8వ పేజీలో...)

రేషన్ దందాపై మంత్రి నజర్

- సత్తెనపల్లి, మేడికొండూరు, వట్టిచెరుకూరుల్లో తనిఖీలు
- రైస్‌మిల్లుల్లో 1000 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం గుర్తింపు
- పలు మిల్లులు.. బియ్యం నిల్వల సీజ్.. కేసుల నమోదుకు ఆదేశాలు
- పేరేచర్లలో ఓ రైస్ మిల్లులోనే ఎండీయూ వాహనాన్ని గుర్తించిన మనోహర్

సత్తెనపల్లి, మేడికొండూరు, గుంటూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం బ్లాక్‌మార్కెట్ దందాపై పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టి సారించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి, గుంటూరు జిల్లా మేడికొండూరు, వట్టిచెరుకూరు మండలాల పరిధిలో గురువారం రాత్రి మంత్రి ఆకస్మికంగా తనిఖీలు చేశారు. టార్చ్‌లైట్ల వెలుగుల్లో పలు మిల్లుల్లో తనిఖీలు చేసి రేషన్ బియ్యం నిల్వలను గుర్తించి కేసుల నమోదుకు ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పేదల బియ్యం బ్లాక్ మార్కెట్ గుట్టు మంత్రి తనిఖీలతో రట్టయింది. వెయ్యి క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. సత్తెనపల్లిలోని రామలింగేశ్వర ట్రేడర్స్ రైస్‌లో వందలకొద్దీ రైస్ బ్యాగుల్లో చౌక బియ్యం నిల్వలను గుర్తించారు. దాదాపు 100 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ విషయమై స్థానిక తహసీల్దారు చక్రవర్తిని ప్రశ్నించారు. జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి బ్యాగ్‌ని పరిశీలించి క్రిమినల్ కేసు నమోదు చేయాలని, సీజ్ చేయాలని మంత్రి ఆదేశించారు. సీతారామాంజనేయ సాయి, గణేష్ రైస్ మిల్లు ఫ్లోర్, శ్రీదేవి ట్రేడర్స్, రావు రైస్ మిల్లు ఫ్లోర్, సత్తెనపల్లి మండలం కొమెరపూడి రైస్ మిల్లు, సుబ్రహ్మణ్యేశ్వర రైస్ మిల్లుల్లో మంత్రి తనిఖీలు చేశారు.

తొలుత పిచ్చాపాటిగా మాట్లాడి ఆరా..

తనిఖీల్లో భాగంగా తొలుత సత్తెనపల్లికి వచ్చిన మంత్రి మనోహర్ తొలుత రోడ్డు పక్కన కారు ఆపి ఓ బడ్డీ కొట్టు వద్ద సామాన్యుడిలా టీ తాగారు. అక్కడ (మిగతా 8వ పేజీలో...)



సత్తెనపల్లిలోని ఓ మిల్లులో బియ్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి

వైసీపీకి సుచరిత గుడ్ బై

8 • జగన్‌కి చెప్పి వచ్చిన మాజీ హోంమంత్రి

జీజీహెచ్‌ని ప్రైవేట్ సూపర్ స్పెషాలిటీలా తీర్చిదిద్దుతాం

• కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

మంగళగిరి క్రికెట్ స్టేడియం రూపురేఖలు మారుస్తాం

6 • ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్

అఫిడవిట్లకు మరింత గడువు

- పర్మినెంట్ లైసెన్సులపై ఎక్సైజ్ ఆదేశాలు
- 40 మద్యం దుకాణదారులు సమర్పించని వైనం
- 14లోగా ప్రక్రియ పూర్తి చేసేందుకు వీలు



బాపట్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపులకు పర్మినెంట్ లైసెన్సులు పొందడానికి గురువారంతో గడువు ముగుస్తుండడంతో 77 షాపుల యజమానులు మాత్రమే పర్మినెంట్ లైసెన్సులు పొందారు. ఇంకా 40 షాపులకు సంబంధించి అఫిడవిట్లు సమర్పించలేదు. ఈ క్రమంలో వీరంతా పర్మినెంట్ లైసెన్సు పొందాలని, నవంబరు 14లోగా ప్రక్రియ పూర్తి చేయాలని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. అఫిడవిట్ కేవలం తాత్కాలికంగానే తీసుకుంటున్నామని లోకేషన్‌తో పాటు బ్యాంకు గ్యారెంటీ విషయంలో నవంబరు 14 తుది గడువని ఎక్సైజ్‌శాఖ చెబుతోంది. ప్రొవిజనల్ లైసెన్సుల మార్గదర్శకాలలో గందరగోళం ఉండడంతో బ్యాంకు గ్యారెంటీలు సమర్పించే విషయంలో షాపుల యజమానులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. లాటరీ ప్రక్రియ పూర్తయ్యాక షాపులను తాత్కాలికంగా ప్రారంభించేటప్పుడే బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వడానికి నెల రోజుల వ్యవధి ఉన్నట్లు ఎక్సైజ్‌శాఖ మార్గదర్శకాలలో తెలిపింది. కానీ పర్మినెంట్ లైసెన్సుల కోసం గడువును తొలుత అక్టోబరు 31గా, తర్వాత నవంబరు 7గా ప్రకటించిన సంగతి తెలిసిందే. చివరిగా పర్మినెంట్ లైసెన్సు పొందని యజమానులకు అఫిడవిట్ సమర్పణలో మరో వారం గడువు ఇవ్వాల్సి వచ్చింది.

పక్కపక్కనే షాపులు..

చాలా చోట్ల లోకేషన్ విషయంలో తకరారు నడవడంతో పక్కపక్కనే షాపులు పెట్టుకుని కొందరు వ్యాపారం చేస్తున్నారు. బాపట్లలోని మార్కెట్ సెంటర్‌లో రెండు షాపుల విషయంలో ఎవరూ మెట్టు దిగకపోవడంతో ఇద్దరూ పక్కపక్కనే పెట్టుకున్నారు. అదేవిధంగా చీలురోడ్డు సెంటర్‌లో, వెదుళ్లపల్లిలో కూడా ఇదే విధంగా పక్కపక్కనే మద్యం షాపులు ఉన్నాయి.

అక్రమ లే అవుట్లపై.. నివేదిక సిద్ధం

- కలెక్టర్‌కు అందించిన రెవెన్యూ విభాగం
- నిబంధనల ఉల్లంఘనలకు జరిమానా అంశం పరిశీలన
- అనధికార లే అవుట్లపై లోకాయుక్తలోనూ కేసు నమోదు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఐదేళ్ల వైసీపీ పాలనలో నిబంధనలను తోసిరాజని ఇష్టారీతిన అక్రమ లే అవుట్లు వేసి కోట్లు దండుకున్నారు. అధికారులు వీటిపై పలుసార్లు నోటీసులు జారీ చేసినా వైసీపీ నేతల అండతో బుట్టదాఖలు చేశారు తప్పితే వాటికి స్పందించిన పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వం రాగానే అనధికార లే అవుట్ల వివరాలను బహిర్గత పరిచింది. తదుపరి చర్యలపై స్పష్టత కోసం గతంలో ఏయే లే అవుట్లకు నోటీసులు జారీ చేశారు, వాటికి వారి నుంచి వచ్చిన స్పందనేమిటీ అనే అంశాలతో పాటు ప్రభుత్వ సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించిన వారెవరనే వివరాలపై రెవెన్యూ యంత్రాంగం కసరత్తు చేసింది. దీనికి తోడు ప్లాట్లు కొనుగోలు చేసిన కొంతమంది బాధితులు లోకాయుక్తను ఆశ్రయించగా అనధికార లే అవుట్ల వివరాలతో పాటు వాటి విషయంలో ఏం చర్యలు తీసుకున్నారో తమకు నివేదించాలని కలెక్టర్‌ను ఆదేశించింది. ఈ క్రమంలో నివేదికను నవంబరు 1న లోకాయుక్తకు అందించడం కూడా జరిగింది. ఆ నివేదికలో అనధికార లే అవుట్ల వివరాలతో పాటు గతంలో ఎన్నిసార్లు నోటీసులు జారీ చేసింది, ఎవరు జవాబిచ్చారు, ఎవరివ్వలేదు అనే వివరాలను పొందుపరిచారు. ఈ నివేదిక ఆధారంగా తీసుకునే చర్యలలో భాగంగా పెద్ద ఎత్తున జరిమానాల కొరడా విధించడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

జిల్లా వ్యాప్తంగా 274 అనధికారిక లే అవుట్లు...

జిల్లా వ్యాప్తంగా 274 లే అవుట్లు నిబంధనలకు విరుద్ధంగా వేసి క్రయవిక్రయాలు సాగించినట్లు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ధ్రువీకరించారు. బాపట్ల మున్సిపాలిటీ పరిధిలో 39, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కింద 104, రేపల్లె మున్సిపాలిటీ కింద 40, అద్దంకి, కొరిశపాడు, చీరాల, పర్చూరు, మార్టూరు, వేటపాలెం భాగమై ఉన్న ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కింద 91 అనధికార లే అవుట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటి వివరాలను బహిరంగ పరుస్తూ గతంలో అధికారులు ప్రకటనలు ఇచ్చారు. వాటిని బహిరంగ పరిచాక కూడా జిల్లా వ్యాప్తంగా దాదాపు 70 ప్లాట్లు రిజిస్ట్రేషన్లు జరిగినట్లు సమాచారం. సదరు విభాగంతో సమన్వయం చేసుకుని ఆ వివరాలను కూడా రెవెన్యూ అధికారులు సేకరించి నివేదికలో పొందుపరిచారు. అనధికార లే అవుట్ల జాబితా ఏదీ తమ వద్దకు రాలేదని, రిజిస్ట్రేషన్లు నిలిపేయమని కూడా తమకు ఎలాంటి ఆదేశాలు ప్రభుత్వం నుంచి రాలేదని రిజిస్ట్రేషన్ విభాగం చెప్పడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా దాదాపు 90 అనధికారిక లే అవుట్లను వైసీపీ ప్రభుత్వంలో అప్పటి జేసీ శ్రీనివాసులు గుర్తించారు. వాటికి నోటీసులు కూడా సర్వ్ చేశారు. దీనితో పాటు సదరు లే అవుట్ల వద్ద అక్రమమని ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేయించారు. ఈ లే అవుట్లలో చాలావరకు వైసీపీ నేతాగణం అనుచరులవే కావడంతో లెక్కలేనితనంతో ఫ్లెక్సీలను తొలగించడమే కాకుండా నోటీసులను తీసుకోవడానికి కూడా కొంతమంది నిరాకరించారు. నిబంధనల ప్రకారం రెండోసారి కూడా నోటీసులు జారీ చేసినా అదే సీన్ రిపీట్ అయింది. మళ్లీ ఇప్పుడు ఆ నోటీసుల తిరస్కరణతో పాటు వివిధ అంశాలపై సమగ్ర విచారణ చేసి నివేదికను సిద్ధం చేశారు.



నిబంధనలకు విరుద్ధంగా వెస్ట్ బాపట్ల పరిధిలో వేసిన లే అవుట్

అలవాట్ల మార్పుతో ఆరోగ్యం

క్యాన్సర్ అవగాహన ర్యాలీలో కలెక్టర్

బాపట్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధి బారీన పడకుండా ప్రజలు తమ ఆహార అలవాట్లు మార్చుకుని ఆరోగ్యంగా ఉండాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. జాతీయ క్యాన్సర్ దినం సందర్భంగా గురువారం బాపట్ల మున్సిపల్ హైస్కూల్ నుంచి పాత బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ చేపట్టారు. ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ విద్యార్థులు, అధికారులతో కలిసి పాల్గొన్నారు. పాతబస్టాండ్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవితం, మెరుగైన జీవనంతో ప్రజల జీవనప్రమాణాలు మెరుగు పడాలన్నారు. బీపీ, మధుమేహం, గుండె, క్యాన్సర్ వంటి జబ్బులు అధికంగా నమోదవుతున్నాయన్నారు. వంశపారపర్యంగా సంక్రమించే వ్యాధులను నివారించడం, అలవాట్లు ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టడానికి రాష్ట్రప్రభుత్వం కసరత్తు చేస్తుందన్నారు. ఇంటింటా సర్వే ద్వారా ప్రజలకు వైద్య సమస్యలను పరిష్కరించడం సాధ్యమౌతుందన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్. విజయమ్మ, డీసీహెచ్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ శేషుబాబు, ఆర్డీవో పి. గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, తహసీల్దార్ షేక్.సలీమా తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి ర్యాలీ చేస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, అధికారులు

సాగునీటి సంఘాల.. ఎన్నికలకు సమాయత్తం

- 20న నోటిఫికేషన్.. 21న టీసీల ఎన్నిక
- 13న తుది ఓటర్ల జాబితాల విడుదల

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రభుత్వ యంత్రాంగం సమాయత్తమైంది. దీంతో పల్లెల్లో ఎన్నికల సందడి నెలకొంది. సాగునీటి సంఘాల ఎన్నికల్లో రైతులకు ఓటుహక్కు కల్పించే ప్రక్రియను రెవెన్యూశాఖ చేపటింది. ఓటర్ల జాబితాలను రూపొందిస్తోంది. నాగార్జునసాగర్ కుడికాల్వ ఆయకట్టు పరిధిలో మేజర్, మైనర్ ఇరిగేషన్ శాఖలు ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తున్నాయి. టీసీల వారీగా భూముల వివరాలను రెవెన్యూశాఖకు జలవనరులశాఖ అందజేసింది. సర్వే నెంబర్లు ఆధారంగా భూహక్కు ఉన్న రైతులను గుర్తించి వారికి ఓటుహక్కును రెవెన్యూశాఖ కల్పిస్తోంది. 2,628 టీసీల వారీగా 13వ తేదీన ఓటర్ల తుది జాబితాలను అధికారులు విడుదల చేయనున్నారు. 274 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటి పరిధిలో 2,628 టీసీలు ఉన్నాయి. ఒక్కొక్క సంఘం పరిధిలో దాదాపు 12 టీసీలు ఉంటాయి. తొలుత టీసీలకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ నెల 20న ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేస్తారు. ఆ మరుసటి రోజు అంటే 21న టీసీలకు ఎన్నికలు జరుగుతాయి. టీసీలకు ఎన్నికైన వారు నీటిసంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. నీటి సంఘాలకు కాల్వ ఎగువ భూముల పరిధిలోని టీసీని అధ్యక్షుడిగా ఎన్నుకుంటే దిగువ భూముల టీసీని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు. నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యాక్షులు డిస్ట్రిబ్యూటరీ కమిటీని ఎన్నుకుంటారు. నీటి పంపిణీలో ఇవి కీలక పాత్ర పోషించనున్నాయి. డీసీలు ప్రాజెక్టు కమిటీని ఎన్నుకుంటాయి. ఎన్నికల నిర్వహణకు సాగు నీటి సంఘాల వారీగా అధికారులను నియమించారు. సమస్యాత్మక నీటి సంఘాలను గుర్తించారు. వీటి ఎన్నికలకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు శాఖను కోరారు. రాజకీయ పార్టీలు ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా స్వీకరిస్తుండటంతో ఏకగ్రీవ ఎన్నికలు జరుగుతాయా లేదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఎక్కువ నీటి సంఘాలకు ఏకగ్రీవ ఎన్నికలు జరిగాయి. ఈ సారి కూడా అదే స్థాయిలో ఏకగ్రీవాలు జరుగుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే డీసీలను కైవసం చేసుకునేందుకు రాజకీయ పార్టీల నేతలు ఎక్కడికక్కడ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు.

డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఇవే..

నాగార్జునసాగర్ కుడి కాల్వ పరిధిలో 32 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. వాటి వివరాలు ఇలా ఉన్నాయి. మాచర్ల, గురజాల, కారంపూడి, కేసానుపల్లి, పిడుగురాళ్ల, తంగెడ, బెల్లంకొండ, క్రోసూరు, చామర్రు, నకరికల్లు, ముప్పాళ్ల, సత్తెనపల్లి, మేడికొండూరు, పెదకూరపాడు, అమరావతి, ఫిరంగిపురం, గుంటూరు, పొన్నెకల్లు, లింగంగుంట్ల, చిలకలూరిపేట-1, 2, పెదనందిపాడు, సంతగుడిపాడు, రొంపిచర్ల, గంటావారి పాలెం, వినుకొండ, చీకటీగలపాలెం, ఐనవోలు, త్రిపురాపురం, ములకలూరు, సంతమాగులూరు, కొమ్మాలపాడు డీసీలు ఉన్నాయి.

పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్



గీత దాటితే.. వేటు తప్పదు

జిల్లా పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన ఎస్పీ

బాపట్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గడచిన రెండు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా పోలీసుశాఖలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగాన్ని ఎస్పీ తుషార్‌డూడీ అప్రమత్తం చేశారు. గురువారం జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీసు అధికారులతో ఎస్పీ తుషార్‌డూడీ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నిందితుల అరెస్ట్ మొదలుకుని వారిని కోర్టులో హాజరుపరిచేంత వరకూ ఎక్కడ నిర్లక్ష్యం తగదన్నారు. ఎస్కార్ట్ డ్యూటీల్లో ఉన్నవారు నిబంధనలను పక్కాగా అమలు చేయాలని ఎస్పీ ఆదేశించారు. వ్యవహారశైలి మార్చుకోవాలని ఓ ఇద్దరు పోలీసు అధికారులను హెచ్చరించినట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో క్లిష్ట పరిస్థితులు ఎదురై నిర్ణయం తీసుకోలేకపోతే తన దృష్టికి తేవాలని సూచించారు. గీత దాటి వ్యవహరించొద్దని, అలా జరిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించినట్లు తెలుస్తోంది. బాధితుల పట్ల మర్యాద పూర్వకంగా మెలగాలని, న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చేవారికి అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులదే అని ఎస్పీ గుర్తు చేశారు.

10న చెస్ ఛాంపియన్ షిప్ పోటీలు


గుంటూరు(తూర్పు), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ది ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ (ఏ పీ సీ ఏ), శ్రీ ఆనంద్ చెస్ వింగ్స్ (ఎస్ ఏ సీ డబ్లూ) సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 10న ఆదివారం స్థానిక పట్టాభిపురం, డీఆర్ఎమ్ కార్యాలయంలో రాష్ట్ర బాల, బాలికల చెస్ ఛాంపియన్ షిప్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎమ్ గోపీనాథ్ తెలిపారు. 2వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు బాల, బాలికల విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. విజేతలకు బాలల దినోత్సవం రోజున పురస్కారాలు అందజేయనున్నట్టు తెలిపారు. ఇతర వివరాలకు 9703049378 నంబరులో సంప్రదించాలని సూచించారు.



ఏఎన్వీ లోహిత్ (100 పరుగులు), నౌనిహాల్ (5 వికెట్లు)

హిమాచల్‌ప్రదేశ్‌పై ఆంధ్రా భారీ స్కోరు

మంగళగిరి సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరుగుతున్న అండర్-19 కూచ్ బెహర్ ట్రోఫీలో భాగంగా ఆంధ్రా జట్టు హిమాచల్‌ప్రదేశ్‌పై భారీ స్కోరు సాధించింది. 374 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు బ్యాటింగ్ దిగిన ఆంధ్రా జట్టు 155 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 615 పరుగులు చేసి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. తొలిరోజు ఆంధ్రా బ్యాటర్లు ఇద్దరు సెంచరీలు సాధించగా, రెండో రోజు ఏఎన్వీ లోహిత్ 121 బంతుల్లో 3 సిక్సర్లు, 7 ఫోర్లతో వంద పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచాడు. కే.రేవంత్ 72, టీ.వరుణ్ సాత్విక్ 68 పరుగులతో రాణించారు. హిమాచల్‌ప్రదేశ్ బౌలర్ ఆర్.నౌనిహాల్ 54 ఓవర్లలో 198 పరుగులు ఇచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన హిమాచల్‌ప్రదేశ్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 25 ఓవర్లలో ఒక్క వికెట్ నష్టానికి 50 పరుగులు చేసింది. అర్పిత్ సింగ్ 26 పరుగులతో క్రీజులో వున్నాడు. మరో రెండు రోజులు ఆట మిగిలివుంది.



ఎన్జీరంగాపై రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు

జమిందారీ వ్యవస్థ రద్దుకు పోరాడిన ఎన్జీ రంగా

● వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

తాడికొండ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం రాకముందు, వచ్చిన తర్వాత దేశంలో జమిందారీ వ్యవస్థను రూపుమాపేందుకు పోరా టాలు చేసి ఆ వ్యవస్థను రద్దు చేసిన వ్యక్తి ఆచార్య ఎన్జీ రంగా అని వ్యవ సాయ శాఖ మంత్రి కే అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఎన్జీ రంగా 124వ జయంతి సందర్భంగా ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యా లయంలో గురువారం ఆయన జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిం చారు. తొలుత ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సభకు మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ అధ్యక్షత వహించారు. మంత్రి మాట్లాడుతూ రైతు బాంధవుడు, ఉపాధ్యాయుడు, రచయిత, ఉత్తమ పార్లమెంటేరియన్ అయిన రంగాను ఉత్తరాంధ్ర ప్రజలు ఆదరించారని అన్నారు. అధునాత విధానంతో వ్యవసాయ చేయ లని రంగా ఆలోచనలు చేశారని గుర్తుచేశారు. రంగా ఆశయాలకు అనుగుణంగా రైతులకే కాకుండా కౌలు రైతులకు కొత్త చట్టాన్ని తీసుకు వస్తు న్నామని, కౌలు రైతుల సలహాలు, రైతు సంఘాలతో చర్చించి కౌలు రైతు చట్టాలను రూపొందిస్తామని అన్నారు. విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు అధునాత వంగడాలను కని పెట్టాలని సూచించారు. రాష్ట్రానికి జాతీయ వ్యవసాయ విశ్వ విద్యాలయాన్ని తీసుకు వచ్చేందుకు కృషి చేస్తామన్నారు. విశ్వ విద్యా లయం భవనాలు త్వరలోనే పూర్తి చేసుకొని ఎన్.జీ.రంగా కాంస్య విగ్ర హాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో గడచిన ఐదేళ్లలో వ్యవసాయ రంగాన్ని నిర్లిప్తితం చేశారని, ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని ప్రోత్సహించి, పూర్వవైభవం తీసుకురావటానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోందని చెప్పారు. డ్రోన్ టెక్నాలజీతో వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పు వచ్చిందని, ఏపీలో వీటిని వినియోగించి వ్యవసాయం చేసేందుకు సిద్ధం చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పాటు బ్యాంకులు లోన్లు ఇచ్చే విధంగా డ్రోన్ల వినియోగాన్ని రైతులకు అందించటానికి ప్రభుత్వం కృషి చేస్తోం దని, రాష్ట్రంలో 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని చేసే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ భూస్వాముల వద్దే కాదు అందరి దగ్గర భూములు ఉండాలని పోరాడిన వ్యక్తి ఎన్జీ రంగా అని కొనియాడారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల ఆంజనేయులు మాట్లాడుతూ దేశ జీడీపీలో వ్యవసాయ రంగ భాగాన్ని పెంచేదిశగా ప్రణాళికలు రచించాలని సూచించారు. అనంతరం అభ్యుదయ రైతు నెక్కంటి సుబ్బారావు, అత్త లూరి ఆర్గానిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ సురేంద్రబాబును సన్మానించారు. ఎన్జీ జీవిత చరిత్ర పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీసీ డాక్టర్ ఆర్. శారదా జయలక్ష్మీదేవి, రిజిస్ట్రార్ డాక్టర్ జీ. రామ చంద్రరావు, డాక్టర్ పీ.వీ. సత్యనారాయణ, రైతు నేస్తం వై.వెంకటేశ్వరరావు, రంగ ట్రస్టు సభ్యులు కిషోర్‌బాబు, సజ్జ హేమలత తదితరలు పాల్గొన్నారు.

సందిగ్ధంలో సాగర్ - శ్రీశైలం లాంచీ ప్రయాణం

మాచర్లటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ టూరిజం ఆధ్వర్యంలో ఈ ఏడాది సాగర్ - శ్రీశైలం లాంచీ ప్రయాణంపై సందిగ్ధం నెలకొంది. సాగర్ జలాశయం నిండు కుండలా ఉన్నా శ్రీశైలానికి లాంచీ ప్రయాణంపై ఏపీ పర్యాటక శాఖ ఆసక్తి కనపరచడం లేదు. తెలంగాణ ప్రాంతంలోని నాగార్జున సాగర్ హిల్ కాలనీ నుంచి తెలగాణ టూరిజం ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి సాగర్ - శ్రీశైలానికి లాంచీ ప్రయాణం మొదలైంది. వివిధ ప్రత్యేక ప్యాకేజీలను తెలంగాణ టూరిజం పర్యాటకులకు అందుబాటులో ఉంచింది. అయితే, ఆంధ్ర ప్రాంతమైన నాగార్జునసాగర్ విజయపురిసౌత్ నుంచి శ్రీశైలంకు లాంచీ ప్రయాణంపై ఏపీ టూరిజం నుంచి ఇప్పటి వరకు ఎటువంటి ప్రకటన విడుదల కాలేదు. ప్రస్తుతం కార్తీక మాసం కావడంతో శ్రీశైలానికి వెళ్లే భక్తులు, పర్యాటకులు సాగర్ - శ్రీశైలం లాంచీ ప్రయాణం కోసం ఎదురుచూస్తున్నారు.



నాగార్జున సాగర్ విజయపురిసౌత్‌లో లాంచీ స్టేషన్ వద్ద లాంచీలు

పర్యాటకులకు మధురానుభూతిని మిగిల్చే ఈ టూరు ఈ ఏడాది ఉన్నట్లా లేనట్లా అని పర్యాటకులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఏపీ పర్యాటక శాఖ ఇప్పటివరకు సాగర్ - శ్రీశైలం టూరు కోసం ఎటువంటి ఏర్పాట్లు మొదలు పెట్టకపోవడంతో పర్యాటకులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

మంగళగిరి క్రికెట్ స్టేడియం రూపురేఖలు మారుస్తాం

● ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్

మంగళగిరి సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ వైఖరి కారణంగా తీవ్ర నిర్లక్ష్యానికి గురైన మంగళగిరి క్రికెట్ స్టేడియం రూపురేఖలు మారుస్తామని ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) స్పష్టం చేశారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అపెక్స్ కౌన్సిల్ సమావేశం మంగళగిరిలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం కార్యాలయంలో గురువారం జరిగింది. అనంతరం సమావేశ వివరాలను ఎంపీ మీడియాకు వెల్లడించారు. మంగళగిరి క్రికెట్ స్టేడియం అభివృద్ధితోపాటు రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధికి సంబంధించి 16 అంశాలపై సమావేశంలో చర్చించినట్లు చెప్పారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి కోసం మూడుచోట్ల క్రికెట్ అకాడమీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, విజయవాడ, అనంతపురం, విశాఖపట్నంలో క్రికెట్ అకాడమీలు ఏర్పాటు కానున్నాయన్నారు. ఈ అకాడమీల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులకు తగిన శిక్షణ ఇప్పిస్తామన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా ఈ స్టేడియం నిర్మాణాలు దెబ్బతిన్నాయని, పన్నెండేళ్ల క్రితం నాటి డిజైన్‌తో ఈ నిర్మాణాన్ని ప్రారం భించడంతో ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా సదు పాయాలు లేవన్నారు. సరైన పార్కింగ్ సదుపాయం ఇప్ప టికీ లేదన్నారు. పార్కింగ్, స్పోర్ట్స్ సెంటరు ఏర్పాటు కోసం 35 ఎకరాల స్థలం అవసరమని, దీనికోసం ఇప్పటికే ప్రభుత్వం, సీఆర్డీయేని కోరిందని తెలిపారు. త్వరలో పశ్చిమ బైపాస్ నిర్మాణం పూర్తికానుందని, పశ్చిమ బైపాస్‌తోపాటు సీడ్ యాక్సెస్ రోడ్డు నుంచి మంగళగిరి స్టేడియానికి దారితీసే రహదార్లను అభివృద్ధి చేస్తామని చెప్పారు. మంగళగిరి నుంచి స్టేడియానికి వచ్చే మార్గంలోని రైల్వే గేటు వద్ద నాలుగు వరుసల ఆర్వోబీ నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయని, అన్ని అనుమతులు వచ్చిన వెంటనే ఇప్పటి వరకు వున్న ఇబ్బందులను అధిగమించి మంగళగిరి క్రికెట్ స్టేడియాన్ని అత్యాధునికంగా తీర్చిదిద్దుతామని ఎంపీ శివనాథ్ స్పష్టం చేశారు. సమావేశంలో ఏసీఏ ఉపాధ్యక్షుడు పీ.వెంకట రామ ప్రశాంత్, కార్యదర్శి సానా సతీశ్, కోశాధికారి దండమూడి శ్రీనివాస్, కౌన్సిలర్ దంతుగౌరు విష్ణుతేజ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్

జీజీహెచ్‌ని ప్రైవేట్ సూపర్ స్పెషాలిటీలా తీర్చిదిద్దుతాం

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు సిటీనవంబరు 7 (ఆంధ్రజ్యోతి):గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిని మరో ఏడాది లోపు ప్రైవేట్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లాగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మ సాని చంద్రశేఖర్ తెలిపారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో శనివారం జరిగిన గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ (హెచ్.డీ.ఎస్) సమావేశంలో పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు మహమ్మద్ నసీర్ అహ్మద్, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులులతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత సమావేశంలో జరిగిన అం శాలపై తీసు కున్న చర్యలపై చర్చిం చారు. జీజీహెచ్‌లో మెరుగైన మౌలిక సౌకర్యాల కల్పన , జీజీహెచ్ కు వస్తున్న అవుట్ పేషెంట్ల సంఖ్యను క్రమబద్ధీకరించడం, ప్రైమరీ హెల్త్ సెంటర్లు , అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను మరింత బలోపేతం చేయడంపై తీసుకోవాల్సిన చర్యలపై, గుంటూరు జీజీహెచ్ , తెనాలి ప్రభుత్వ ఆసుపత్రిలో జన ఔషధి కేంద్రాలను ఏర్పాటు చేయడం , సర్వీస్ బ్లాక్ పనులు పూర్తి చేయడం , బొంగరలాబీడులోని ఆరు ఎకరాల భూమి ఆక్రమణలకు గురికాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు వంటి అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు.

అనంతరం కేంద్ర సహాయ మంత్రి మాట్లాడుతూ చాలా సమస్యలను పరిష్కారమయ్యాయని, 'సాహో' పేరుతో ప్రత్యేక ప్రణాళిక ద్వారా గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి ముందుకు వెళ్తున్నామన్నారు. జీజీహెచ్‌కు రోజుకు వెయ్యి మంది రోగులు అవుట్ పేషెంట్లుగా వస్తున్నారని, ఈ సమస్యను పరిష్కరించేందుకు గ్రామీణ ప్రాంతంలోని ప్రైమరీ హెల్త్ సెంటర్లు, జిల్లాలోని 27 అర్బన్ హెల్త్ సెంటర్లను క్రియాశీలకంగా చేయడం వల్ల జీజీహెచ్ కు ఒత్తిడి తగ్గుతుందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలు ఆరోగ్యాన్ని చూపించుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలని చర్చించినట్లు చెప్పారు. జీజీహెచ్‌లో, తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి జన ఔషధి అదనపు షాపుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీఎస్ఆర్ కింద రూ. 65 లక్షల విలువ గల ఆప్తాల్మజి ఎక్విప్మెంట్ ను అందిస్తున్నట్లు తెలిపారు. జీజీహెచ్‌కు సంబంధించిన సమస్యలపై సిస్టమేటిక్‌గా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మరో ఏడాది లోపు ప్రైవేట్ ఆసుపత్రి లాగా జీజీహెచ్‌ను మారుస్తామని చెప్పారు. స్థానిక బొంగరలా బీడులోని ఆసుపత్రికి సంబంధించి ఆరు ఎకరాల భూమి ఆక్రమణకు గురి కాకుండా ఫెన్సింగ్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అలాగే ఎంసీహెచ్‌కు సంబంధించి అవసరమైన ఎక్విప్మెంట్‌కు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, సర్వీస్ బ్లాక్ నిర్మాణానికి గతంలో రూ. 5 కోట్లను తులసి రామచంద్ర ప్రభు అందజేస్తామని చెప్పాని అన్నారు. అయితే, ప్రస్తుత అంచనాల ప్రకారం అంతకు మించి ఖర్చు అయ్యే అవకాశం ఉంది కనుక తన స్నేహితుని ద్వారా మరో రూ.కోటి రూపాయలు విరాళంగా తీసుకురాబోతున్నట్లు చెప్పారు. నర్సింగ్ విద్యార్థులకు ఉపయోగ పడేలా కాలేజీకి బస్సు ఏర్పాటు చేయడం కోసం ప్రయత్నిస్తున్నామని, రూ. 50 లక్షలు పెట్టి నర్సింగ్ విద్యార్థులకు తులసీ రామచంద్రప్రభు బస్సు ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారని అన్నారు.



జీ జీహెచ్ సమీక్షలో కేంద్ర మంత్రి చంద్రశేఖర్, ఎమ్మెల్యే నసీర్ , కలెక్టర్ నాగలక్ష్మి

సీఎంఆర్ఎఫ్ రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

కాలేయ సమస్యతో బాధపడుతున్న గుంటూరుకు చెందిన కటాలి లక్ష్మణ ఆదిత్య (12) కు ఇటీవలే కాలేయ మార్పిడి జరిగింది. ఆదిత్య కుటుంబ ఆర్థిక సమస్యల కారణంగా మంత్రి చంద్రశేఖర్‌ని సంప్రదించగా ఆయన తక్షణమే స్పందించారు. సమస్యను వివరిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి రాసిన లేఖ మేరకు ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ నుంచి తక్షణ సాయం అందింది. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబానికి రూ. 7 లక్షల చెక్కును పెమ్మసాని చంద్రశేఖర్, కలెక్టర్, ఎమ్మెల్యే జీఎంసీ కమిషనర్ కలిసి అందజేశారు.

కార్యక్రమంలో కమిటీ సభ్యులు రామచంద్ర ప్రభు, జీజీహెచ్ పర్యవేక్షకులు డాక్టర్ హరిత, జీయంసీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎస్.వి.రమణ, డాక్టర్ ఎస్. సుందరా చారి, సీవీ రమణ, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి, ఆర్ఎంఓ సతీష్‌కుమార్, అడ్మినిస్ట్రేటర్లు ప్రవీణ్ కుమార్, సీహెచ్. సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంస్థలు రైతులకు అండగా నిలవాలి

● తిమ్మాపురంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

యడ్లపాడు, నవంబరు 7 (ఆంధ్ర జ్యోతి) : రైతుల వద్ద నుంచి పత్తిని ప్రభుత్వ సంస్థలు నేరుగా కొనుగోలు చేసి వారికి అండగా నిలవాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని తిమ్మాపురం పరిధిలోని శ్రీనివాస కాటన్ మిల్లులో కాటన్ కార్పోరేషన్ ఇండియా(సీసీఐ) కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రాష్ట్రంలోనే తొలి పత్తి కొనుగోలు కేంద్రాన్ని నియోజకవర్గంలో ఏర్పాటు చేయడం జరిగిందని, ఇది రైతులకు ఎంతో మేలు చేసే విషయమన్నారు. కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన రోజే తూకం వేయడంతోపాటు నాణ్యతను పరిశీలించి ధర నిర్ణయం జరుగుతుందన్నారు. తేమ శాతం 8 కన్నా తక్కువ ఉంటే మద్దతు ధర రూ.7,521 చెల్లించడం జరుగుతుందన్నారు. అంతకన్నా ఎక్కువ ఉంటే తేమ, పింజ పొడవు ఆధారంగా కనీస ధర రూ.7,124 చెల్లిస్తారని చెప్పారు. అయితే, ప్రస్తుతం సీసీఐ చెల్లిస్తున్న ధర రైతులకు సంతోషాన్ని ఇవ్వలేదని, కేవలం 10 నుంచి 20 క్వింటాళ్ళు దిగుబడి సాధించిన రైతులకు మాత్రమే గిట్టుబాటు అవుతోందని అన్నారు. అధిక వర్షాలు, తెగుళ్ళు సోకి ఈ ఏడాది దిగుబడులు బాగా తగ్గాయని, ఎకరాకు 6 క్వింటాళ్లకు మించి దిగుబడులు వచ్చే పరిస్థితి లేదన్నారు. సీసీఐ ఇస్తున్న మద్దతు ధర కొంత మేర రైతులకు ఊరట నిస్తుందని, ప్రైవేటు వ్యాపారస్తులు ఈ ధరకు కొనుగోలు చేసే పరిస్థితి లేదని, తక్కువ ధరకు బయటి వ్యక్తులకు అమ్ముకోవద్దని సూచించారు. పత్తి రైతులు సంక్షోభంలో ఉన్నారని, ధర ఎంత ఇచ్చినా వారి కష్టాలు తీరవన్నారు. కూలీల కొరత, పెరిగిన పెట్టుబడులు రైతుల నడ్డి విరుస్తున్నాయన్నారు. దూర ప్రాంతాల నుంచి కూలీలను తెచ్చుకుని పనులు చేయించుకునే దుస్థితి నెలకొందన్నారు. దీనికి తోడు టెక్స్‌టైల్ రంగం కూడా సంక్షోభంలో ఉందని, పత్తి కొనేదానికి అమ్మేదానికి పొంతన లేకుండా పోయిందన్నారు. సీఎం చంద్రబాబు రైతులను ఆదుకునేందుకు కూలీల సమస్యను అధిగమించేందుకు డ్రోన్ టెక్నాలజీని తీసుకు వస్తున్నానన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేయాలన్న ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం ఉందన్నారు. కార్యక్రమంలో సీసీఐ ఆర్‌డి రమేష్, సీనియర్ కమర్షియల్ అధికారి రమేష్, జనసేన నాయకులు తోట రాజారమేష్, టీడీపీ నాయకులు కే రఘురామారావు, కే సాయిబాబు, పీ పిచ్చియ్య, ఆలోకం వీరనారాయణ, పీ హనుమంతరావు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు

లా సెట్ అడ్మిషన్ల రిపోర్టింగ్ గడువు నేటి వరకు పెంపు

పెదకాకాని, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏపీ లా సెట్-2024 ప్రవేశాలకు సంబంధించి సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కళాశాలలో రిపోర్ట్ చేసే గడువు తేదీని ఒక రోజు పొడిగించినట్లు లా సెట్ అడ్మిషన్ల కన్వీనర్ ప్రొఫెసర్ బి. సత్య నారాయణ గురువారం తెలిపారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 7వ తేదీతో ముగిసిందని, విద్యార్థుల కోరిక మేరకు 8 వరకు గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు. ఎవరైన లా సెట్ విద్యార్థులు కళాశాలల్లో రిపోర్ట్ చేయనట్లయితే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు ఏపీ లా సెట్ వెబ్ సైట్ ను చూడాలని సత్యనారాయణ పేర్కొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో గురువారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 8,675 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద రెండు వేల క్యూసె క్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసె క్కులు విడుదల అవుతున్నాయి.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 586.20 అడుగులు ఉంది. ఇది 301.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 6253 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 4613 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,151 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 42,817 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. కాగా, శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 57,220 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ తరగతులు

గుంటూరు సిటీ, నవంబరు 7 (ఆంధ్ర జ్యోతి): గుంటూరు, బాపట్ల జిల్లాల అధికారులకు గ్రామ పం చాయతీ అభి వృద్ధి ప్రణాళికలపై శిక్షణా తరగతులు గురువారం నిర్వహించారు. గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఐఆర్ డీపీఆర్ జేడీ ఆర్. కేశవరెడ్డి పాల్గొని మండల పరిషత్ అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. 2025-2026 సంవత్సర ప్రణాళికలు రూపకల్పన స్థానిక అవ సరాలను సామాజిక న్యాయం, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అన్ని వర్గాలను అభివృద్ధి చేసే విధంగా ఉండేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నీటివనరుల సంరక్షణ అధి కారి వీ శంకర్,రిసోర్స్ పర్సన్ లలిత, డీ పీ ఎం రవీంద్ర బాబు,ఈ ఓ పీ ఆర్ డీ కె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేడీ కేశవరెడ్డి

ఐసీఐసీఐ బ్యాంకులో గోల్ మాల్ కేసులో .. ఒకరి అరెస్టు

చిలకలూరిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఐసీఐసీ బ్యాంకు వివిధ బ్రాంచ్‌లలో నగదు, బంగారం గోల్ మాల్ జరిగిన కేసులో కదలిక వచ్చింది. చిలకలూరిపేట, నరసరావుపేట, విజయవాడ ఐసీఐసీ బ్యాంకు బ్రాంచ్‌లలో జరిగిన అవకతవకలపై సీఐడీ పోలీసులు దర్యాప్తు చేస్తున్న విషయం విదితమే. బ్యాంకు చిలకలూరిపేట బ్రాంచ్‌లో గోల్డ్ లోన్ కౌన్సిలర్‌గా ఉన్న అన్నం హరీష్ (37) ను సీఐడీ అడిషనల్ ఎస్పీ ఆదినారాయణ ఆధ్వర్యంలో గుంటూరులో అరెస్టు చేశారు. సీఐడీ సీఐ సంజీవ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం అరెస్టు అయిన హరీష్ ను విజయవాడలోని థర్డ్ అడిషనల్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరిచారు. అతడికి ఈ నెల 21 వరకు రిమాండ్ విధించారు. విచారణ కోసం అతడిని కస్టడీకి అనుమతించాలని కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం నాడు ఈ విషయంపై నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. ఖాతాదారులకు సంబంధించిన బంగారాన్ని బినామీ పేర్లతో వేరే బ్యాంకులలో, ఫైనాన్స్ కంపెనీలలో డిపాజిట్ చేసి అతడు రుణాన్ని తీసుకున్నట్టుగా సమాచారం. చిలకలూరిపేట బ్రాంచిలో బంగారాన్ని తాకట్టు పెట్టిన ఖాతాదారులకు తెలియకుండా ఎక్కువ మొత్తంలో రుణం మంజూరు చేయించి వారి చేతికి తక్కువ మొత్తం నగదు ఇచ్చి మిగిలింది స్వాహా చేసినట్టుగా కూడా ఆరోపణలు ఉన్నాయి. కాగా, బ్యాంకు మేనేజరుగా వ్యవహరించి కేసులో కీలక వ్యక్తిగా ఉన్న డీ నరేష్ చంద్రశేఖర్ ఇంకా పరారీ లోనే ఉన్నాడు.

ఏం కావాలో స్పష్టంగా తెలుసుకోవాలి

● వ్యక్తిత్వ వికాస నిపుణుడు కెవీ ప్రదీప్

గుంటూరు(విద్య),నవంబరు 7(ఆంధ్రజ్యోతి): యువత జీవితంలో తమకు ఏం కావాలో స్పష్టత ఉండాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు, సినీ,టీవి నటులు కేవీ ప్రదీప్ అన్నారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో గురువారం బీటెక్ విద్యార్థుల కోసం 'టేక్ అప్ టు టేక్ ఓవర్' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువలు, బలం, వైఖరి,నైపుణ్యాలు,జ్ఞానం అనే ఐదు లక్షణాలు విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు. చివరి సంవత్సరంలో క్యాంపస్ డ్రైవ్‌లో ఉద్యోగం సాధిస్తే ఒత్తిడి తగ్గుతుందని, ఇందుకు ఎంతో కృషి భావ వ్యక్తీకరణ అవసరమని అన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఎప్పకప్పుడు యువత నూతన ఆలోచనలతో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో వీసీ ఆచార్య పీ నాగ భూషణ్, డీన్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రదీప్

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.65 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	133, 142,153
చికెన్ విత్ స్కిన్	254.00
చికెన్ స్కిన్ లెస్	264.00

49,882 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 48,327 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 49,882 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 27,397 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8000	16000	334	8000	15500
నెంబరు. 5	8500	12500	నెంబరు. 5	9500	15000
273	10000	12200	273	9500	15000
341	8000	15500	341	9500	16000
4884	10000	15000	4884	14000	16000
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	17500	తేజ	8500	17500
బ్యాడిగి	8000	14200	బ్యాడిగి	8500	14800
దేవనూరు డీలక్స్	9000	14000	దేవనూరు డీలక్స్	9000	14000
తెల్లకాయలు	4500	10500	తెల్లకాయలు	5000	10000

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ ద్వారా గ్రామాలాభివృద్ధి

● ఎంపీటీసీ సాంబశివరావు

కర్లపాలెం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథ కం ద్వారా గ్రామాలు అభివృద్ధి చెందుతాయని నల్లమోతువారిపాలెం ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు అన్నారు. నల్లమోతువారిపాలెం పంచాయతీ కార్యాలయంలో గ్రామీణ ఉపాధిహామీ పథకంపై గురువారం గ్రామసభ నిర్వహించారు. ఉపాధిహామీ పథకం ప్రాముఖ్యతను వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీలను కూడా సద్వినియోగం చేసుకోవాలని తాండ్ర సాంబశివరావు కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి వి.వెంకటేశ్వరరావు, మెంబరు తాండ్ర వర్ధనాదేవి, టెక్నికల్ అసిస్టెంట్ శివయ్య, టీడీపీ ఇన్‌ఛార్జి మునిపల్లి చిన్న, శేషగిరి, దొంతెన రామారావు, బీసాలబత్తిన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై దాడులు

● నలుగురిపై కేసు నమోదు

వేమూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో నలుగురు గ్రామాల్లో ఎక్సైజ్ శాఖ సిబ్బంది బెల్టు షాపులపై దాడి జరిపి సంబంధిత నిర్వాహకులను అరెస్టు చేసినట్లు ఆ శాఖ సీఐ రవి తెలిపారు. బుధ, గురువారాల్లో వివిధ గ్రామాల నుంచి తమకు అందిన సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు తెలిపారు. కొల్లూరు మండలం కిష్కింద పాలెంలో వేమూరు మండలం జంపని, పోతుమర్రు గ్రామాల్లో, అమృతలూరు మండలం ఇంటూరు గ్రామంలో దాడులు నిర్వహించామన్నారు. వారి నుంచి 44 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు.

పోతార్లంక మాజీ సర్పంచ్ మృతి

కొల్లూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకులు, పోతార్లంక గ్రామ మాజీ సర్పంచ్ మద్దూరి సుబ్బారావు (70) కన్నుమూశారు. గురువారం పోతార్లంకకు చెం దిన మాజీ సర్పంచ్ అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి సమాచారం తెలుసుకున్న టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ కొల్లి శివరామకృష్ణ, టీడీపీ నాయకులు ఈడ్పుగంటి బుజ్జి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

పిట్లవానిపాలెం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని ఎంఈవో-1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు అన్నారు. మంతెనవారిపాలెం ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను గురువారం సందర్శించారు. ఉపాధ్యాయులు విద్యాబోధన గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

డీఆర్‌డీఏ అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. డీఆర్‌డీఏ పరిధిలో అమలయ్యే పథకాలపై ఆ శాఖాధికారులతో గురువారం కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పేదల్లైన మహిళల జీవితాలు ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా క్షేత్ర స్థాయిలో పనిచేయాలని చెప్పారు. డ్వాక్రా సంఘాల్లోని మహిళల అభ్యున్నతి పై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. జిల్లాలో 3,40,725 మంది మహిళలు పొదుపు చేసుకుంటూ 33,374 డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా ఉన్నారని చెప్పారు. 1,031 గ్రామ సంఘాలు నడుస్తున్నాయన్నారు. పొదుపు మహిళలంత దాచుకున్న సొమ్ము బ్యాం కుల్లో రూ.438 కోట్లు ఉన్నట్లు తెలిపారు. మహిళలు తమ పొదుపు సొమ్మును వినియోగించుకునేలా 50 శాతం మేరకు నగదును సంఘాలకు విడుదల చే యాలన్నారు. బ్యాంకు అధికారులు రూ.215 కోట్ల నిధులను మహిళలకు విడుదల చేయాలన్నారు. బ్యాం కు రుణాల్లో నగరం, సంతమాగులూరు, జె.పంగులూరు, రేపల్లె మండలాల్లో లక్ష్యాలు సాధించకపోవ టం ఏమిటని అధికారులను కలెక్టర్ నిలదీశారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు బ్యాంకు రుణాలను మం జూరు చేయించాలని ఆయన ఆదేశించారు.

● ఉన్నతి పథకాన్ని అధికారులు సమర్థంగా అమలు చేయాలని కలెక్టర్ చెప్పారు. బ్యాంకు రుణాలు తిరిగి చెల్లింపులు సక్రమంగా జరగకపోవటంపై ఆరా తీశారు. మొండి బకాయిలు రూ.17.15 కోట్లు నిలిచిపోవటంపై ఆసహనం వ్యక్తం చేశారు. మహిళలను డీఆర్‌డీఏ అధికారులు చైతన్య పర్చాలన్నారు. సమస్యలు ఎదురైతే తక్షణమే జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, డీఆర్‌డీఏ పీడీ విజయ్, ఎల్‌డీ ఎం శివక్యుష్ణ, పరిశ్రమల శాఖాధికారులు, డీపీఎంలు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.



డీఆర్‌డీఏ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ జేవీ మురళి

ప్రజల ఆరోగ్యంపై ప్రతిఇంటా సర్వే

ప్రజల ఆరోగ్యంపై ఈనెల 14వ తేదీ నుంచి ఎన్‌సీడీసీ ఇంటింటా సర్వే చేపడుతున్నట్లు కలెక్టర్ జేవీ మురళి తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై డివిజన్, మండలస్థాయి అధికారులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌సీడీసీ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించాలని డివిజన్, మండలస్థాయి అధికారులకు సూచించారు. 50 రకాల ప్రశ్నలతో సర్వే జరుగుతుందని దీనికి ప్రజలు సహకరించాలన్నారు. క్యాన్సర్, బీపీ, మధుమేహం, గుండెజబ్బులు వంటి వాటిని గుర్తించాలన్నారు. ఎన్‌ఎంలు, ఎంఎల్ హెచ్‌పీలు సర్వేలో పాల్గొంటారన్నారు.

● రబీ ఉపాధి చూపాలని కలెక్టర్ తెలిపారు. 2.64 లక్షల మందికి జాబ్‌కార్డులు ఇచ్చినప్పటికీ వారం దరికీ పూర్తి స్థాయిలో ఉపాధి చూపాలన్నారు. పేదలకు ఉపాధికల్పించేలా పనులు గుర్తించాలని మల్బరీ ఉద్యాన పంటలను ప్రోత్సహించేలా ప్రణాళికలను పొందించాలన్నారు. తీరప్రాంతాల వద్ద పండ్ల మొక్కలు, ఇతర మొక్కలు నాటి ఆటవీ సంపదను విస్తరింప చేయటానికి కృషి చేయాలన్నారు. సర్వేలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వీఆర్వోలు, గ్రామ, మండల సర్వేయర్లు, తహసీల్దార్లపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

● భూముల రీసర్వే వేగంగా పూర్తిచేయటానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జేసీ ప్రఖర్‌జైన్ తెలిపారు. జిల్లాకు 1.6లక్షల సర్వే హద్దురాళ్ళు వచ్చాయన్నారు. అవసరమైన చోట హద్దులు చూపి వాటిని నాటాలన్నారు. రీసర్వేపై వస్తున్న అర్జీలను తక్షణమే పరిష్కరించాలన్నారు. సమావేశంలో డీఆర్వో గంగాధర్‌గౌడ్, అనుబంధశాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు, ఎంపీడీవోలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

న్యూజిలాండ్ ప్రధానిని కలిసిన బాపట్ల, పర్చూరు ఎమ్మెల్యేలు

● ముఖ్యమంత్రి చంద్రబాబు మంచి విజనరీ : క్రిస్టోఫర్ లక్సన్

బాపట్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎన్ఆర్ఐ టీడీపీ, మన ఆంధ్ర తెలుగు అసోసియేషన్ ఆహ్వానం మేరకు న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లిన బాపట్ల, పర్చూరు ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, ఏలూరి సాంబశివరావులు ఆదేశ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్‌ను కలిశారు. ఆయనకు పుష్పగుచ్చాలు అందజేసి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్‌లక్సన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తనకు బాగా తెలుసునని మంచి విజనరీ లీడర్ అని కితాబిచ్చారు. చంద్రబాబు సారథ్యంలో నెలకొల్పిన క్రియామోటర్స్ కార్యకలాపాలను ఆంధ్రప్రదేశ్ నుంచి న్యూజిలాండ్‌కు వస్తున్నాయని ఎమ్మెల్యేలు ఏలూరి, వేగేశన క్రిస్టోఫర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆంధ్రప్రదేశ్ పర్యటనకు రావాలని ప్రధానిని ఆహ్వానించారు. మార్చిలో అమరావతి పర్యటనకు వస్తానని ఆయన చెప్పినట్లు వివరించారు. కార్యక్రమంలో న్యూజిలాండ్ నేషనల్‌పార్టీ ప్రతినిధులు శివకిలారి, బాలవేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ న్యూజిలాండ్ కోఆర్డినేటర్ జితేందర్ నిమ్మగడ్డ, మన ఆంధ్ర తెలుగు అసోసియేషన్ నాయకులు మధుసూదన్ దిలీప్, అశోక్ గోరంట్ల, ఎన్ఆర్ఐ టీడీపీ అసోసియేషన్ నాయకులు ఉన్నారు.



క్రిస్టోఫర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, ఏలూరి సాంబశివరావు

యాంటీ డ్రగ్స్ అండ్ ఈవ్‌టీజింగ్‌పై అవగాహన

బాపట్లరూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో 'యాంటీ డ్రగ్స్ అండ్ ఈవ్‌టీజింగ్ అనే అంశం మీద బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా వచ్చిన బాపట్లరూరల్ సీఐ కె.గంగాధర్ మాట్లాడుతూ బాపట్ల నగరంలో బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలకి ప్రత్యేక గుర్తింపు ఉందని ఇటువంటి కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లో కూడా డ్రగ్స్, గంజాయి మాదకద్రవ్యాలు లాంటి చెడు వ్యసనాలకు బానిసలు కాకూడదన్నారు. ఈ విద్యార్థులు డ్రగ్స్ వినియోగం వల్లే కలిగే దుష్ఫలితాలు, చట్టపరమైన చర్యలు, శిక్షలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ దొప్పలపూడి రామ్మోహనరావు, సెక్రటరీ మానం నాగేశ్వరరావు, కె.హరి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యార్థులు సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి

● అసోసియేట్ డీన్ పి.ప్రసూనరాణి

బాపట్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధే పరమావధిగా, అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా వ్యవసాయ విద్యార్థులు తమ విద్యలో నైపుణ్యతను పెంపొందించుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్‌డీన్ డాక్టర్ పి.ప్రసూనరాణి పేర్కొన్నారు. కళాశాలలో గురువారం ఆచార్య ఎన్జీరంగా 124వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన పటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో అసోసియేటిడీన్ మాట్లాడుతూ వ్యవసాయరంగ అభివృద్ధికి, రైతుల అభ్యున్నతికి ఎన్జీరంగా చేసిన కృషిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, ఎన్ఎస్ఎస్, ఎన్ఏఎస్ఎస్ అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



బాపట్ల వ్యవసాయ కళాశాలలో ఎన్జీరంగా పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న అసోసియేట్ డీన్ పి.ప్రసూనరాణి తదితరులు

హించారు. రంగా పటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో అసోసియేట్ డీన్ మాట్లాడుతూ రైతు లబాధలపై పార్లమెంట్‌లో బలమైన గొంతు వినిపించిన నేత ఎన్జీరంగా అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ ఆశోక్‌కుమార్, లీక్షేనా సులోచిత్ర, ఎస్ విష్ణువర్ధన్, లావణ్య, డి.వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్జీ రంగా చిరస్మరణీయులు : సర్దార్‌బేగ్

రైతునాయకుడు ఆచార్య ఎన్జీ రంగా చిరస్మరణీయులని ఎన్జీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల అసోసియేట్‌డీన్ ఎం సర్దార్‌బేగ్ పేర్కొన్నారు. కళాశాలలో గురువారం ఎన్జీ రంగా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బ్రైన్ సాగర్, ఎస్ వి నర్, దిలీప్‌సేన్, నూకరత్నం, లక్ష్మీలావణ్య, పణీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో...

పట్టణంలోని డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో ఆచార్య ఎన్జీరంగా జయంతి వేడుకలను అసోసియేట్ డీన్ డీ స్మిత్ ఆధ్వర్యంలో నిర్వ

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ

భట్టిప్రోలు(కొల్లూరు), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును బాధిత కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు గురువారం అందజేశారు. మండల పరిధిలోని ఓలేరు గ్రామానికి చెందిన కేశన హనుమంతరావు అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. చికిత్సకు అయిన బిల్లును ఎమ్మెల్యే ఆనందబాబుకు చూపించి సాయం కోరారు. స్పందించిన ఎమ్మెల్యే రిఫరెన్స్ లెటర్ ద్వారా సీఎంఆర్ఎఫ్ కార్యాలయానికి పంపించారు. ఆయన చొరవతో మంజూరైన సీఎం సహాయనిధి రూ.15 వేల చెక్కు హనుమంతరావు కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. కుటుంబసభ్యులు ఎమ్మెల్యే ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



సీఎం సహాయనిధి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ఆటల్లో రాణించడం ద్వారా ఉద్యోగావకాశాలు

● వీఆర్ఎస్ కళాశాల కరస్పాండెంట్ బుచ్చియ్యచౌదరి

నగరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆటల్లో రాణించడం ద్వారా ఉద్యోగావకాశాలు పొందేందుకు మరింత అవకాశం ఉంటుందని శ్రీవెంగళపూడి రామకృష్ణ స్మారక కళాశాల కరస్పాండెంట్ ఎంఎల్ చెక్కట బి వల్లభనేని బుచ్చియ్యచౌదరి అన్నారు. ఈ నెల 6వ తేదీన ఏఎన్‌యూలో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్‌లో స్త్రీల ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఆరుజేమోబాబు ద్వితీయ బహుమతి సాధించారు. అంతేకాక యూనివర్సిటీ టీంకి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో జరిగిన అభినందన సభలో బుచ్చియ్యచౌదరి విద్యార్థిని అభినందించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఆనగాని హరికృష్ణ మాట్లాడుతూ యూనివర్సిటీలో జరిగే నేషనల్ గేమ్స్‌లో ఆరుజేష్ కళాశాలకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ వి.వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ పి.అమరేంద్రరెడ్డి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వి.సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతకు మారుపేరు డీఆర్వో సత్తిబాబు : కలెక్టర్

బాపట్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు నిబద్ధతకు మారుపేరుగా నిలిచారని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. బదిలీపై వెళుతున్న డీఆర్వో సత్తిబాబుకు గురువారం రాత్రి కలెక్టరేట్‌లో వీడ్కోలు సభ నిర్వహించారు. పూలమాలలు వేసి సత్తిబాబును ఘనంగా సత్కరించి సన్మానించారు. పలువురు ఉద్యోగులు, అధికారులు ఆయన సేవలను కొనియాడారు, జ్ఞాపికలు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఆత్మంతో బాధ్యతతో వ్యవహరించారన్నారు. అన్నిశాఖల జిల్లా అధికారులను సమన్వయం చేసుకుంటూ నిబద్ధతతో పనిచేశారు. మంచిపేరు సంపాదించుకున్నారన్నారు. కార్యక్రమంలో జేసీ ప్రఖర్‌జైన్, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, బాపట్ల, చీరాల ఆర్డీవోలు పి.గ్లోరియా, చంద్రశేఖర్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా అందరికీ ఉచిత గ్యాస్ సిలెండర్లు

● జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

బాపట్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అర్హతే ప్రామాణికంగా అందరికీ ఉచిత గ్యాస్ సిలెండర్లు ఇస్తామని జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం సాయంత్రం పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి ఈపీ విలియమ్స్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్యాస్ వినియోగదారుడు తప్పనిసరిగా రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, గ్యాస్ ఏజెన్సీవారు ఇచ్చిన నమోదుపత్రం, బ్యాంకు పాస్‌పుస్తకం లింక్ చేసినవారే ఈ పథకానికి అర్హులు అన్నారు. ప్రతి వినియోగదారుడు ఆధార్‌తో ఈకేవైసీ నమోదు చేసుకోవాలన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ కొనుగోలు ఉన్న దీపం కనెక్షన్, ట్రైబల్ ప్యాకేజీ కనెక్షన్, సీఎస్ఆర్ కనెక్షన్, పీఎంయూవై కనెక్షన్, జనరల్ కనెక్షన్ వంటి 5 కేటగిరీలలో ఉన్నటువంటి లబ్ధిదారులు దీపం-2 పథకానికి అర్హులు అన్నారు. ఏమైనా అనుమానాలుంటే తక్షణమే సంబంధితాధికారులను సంప్రదించాలని లేదా కాల్‌సెంటర్ నెంబరు 1967కు ఫిర్యాదు చేసుకోవచ్చు అన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

కొల్లూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండల గ్రామాల్లో అభివృద్ధి పనులు సత్వరమే జరగాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. ప్రగతి నివేదికలను పరిశీలించారు. లంక గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, సర్పంచులు, గ్రామాల్లో జరిగిన వరద ముంపునకు గురైన పంటలకు, గృహాలకు నష్టపరిహారం అందలేదని సభాముఖంగా తెలియజేశారు. ఉద్యానశాఖ అధికారి కళ్యాణ చక్రవర్తి కొన్ని గ్రామాల్లో పంట నష్టపరిహారం సంబంధించి నివేదికలను సిద్ధం చేసామని, నగదు రైతు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుందని సమాధానమిచ్చారు. కొల్లూరు కరకట్ట నుంచి అన్నబాపిరావుపాలెం రోడ్డు నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని మరమ్మతులు చేయాలని కోరారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు మురాల రాంబాబు, ఎంపీడీవో నరసింహారావు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆధ్వర్యంలో క్యాన్సర్ అవగాహన ర్యాలీ

కర్లపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తో సాధ్యమని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్లు గోపినాథ్, సుహానాబేగంలు సంయుక్తంగా అన్నారు. గురువారం డాక్టర్లు, వైద్యసిబ్బంది కలిసి క్యాన్సర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్యాన్సర్‌కు ముందస్తు పరీక్ష, క్యాన్సర్ నుంచి రక్ష అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ గోపినాథ్, సుహానాబేగం, మేరమ్మ, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జియో ట్యాగింగ్ సర్వే

వేమూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు నియోజకవర్గంలో గురువారం నుంచి జియో ట్యాగింగ్ సర్వేను ప్రారంభించారు. ప్రధానంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు అందవలసిన సొమ్ము నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమచేయాలని అలాగే లబ్ధిదారులు తమ ఇచ్చిన చిరునామాలో నివాసం ఉంటున్నది లేనిది ఈ సర్వే ద్వారా నిర్ధారించనున్నారు. మండలాల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు వలంటీర్లు సచివాలయ సిబ్బంది నియోజకవర్గంలోని గ్రామాల్లో సర్వేలు నిర్వహిస్తున్నారు.

పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్ విజయమ్మ

బాపట్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పౌష్టికాహారంపై గర్భిణి, బాలింతలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్ విజయమ్మ వైద్య సిబ్బందికి తెలియజేశారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో వైద్యసిబ్బంది సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి గర్భిణీకి తప్పనిసరిగా రెండు స్కానింగ్‌లు చేయించాలని చెప్పారు. హైరిస్క్ గర్భవతులను ముందుగానే గుర్తించి వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు అయ్యేవిధంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీహెచ్ఎస్ శేషుకుమార్, బ్రహ్మం, డీపీవో, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్ ఖాళీ చేయించిన అధికారులు

వేమూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అక్రమంలో హాస్టల్ భవనం అంటూ గురువారం ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రాజదీపోరా ఆదేశాల మేరకు రేపల్లె అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ కె.సత్యనారాయణ తక్షణ చర్యలకు పూనుకున్నారు. గురువారం సాయంత్రం హాస్టల్ భవనం వద్దకు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ప్రసాద్, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్లు హరికృష్ణ, శాంతిప్రియ, జనవవరపు ఎస్ప్ఎం ప్రసాదరావులు నివాసాలు ఉంటున్న వారిని తక్షణమే ఖాళీ చేయాలని కోరారు. అందుకు నిరాకరించిన నివాసితులు తమ కు గడువు ఇవ్వాలని కోరారు. హైబదారులు ఆదేశాలపై తక్షణమే ఖాళీ చేయాలని పేర్కొన్నారు. అధికారుల ఆదేశాలతో ఎట్టకేలకు ఆక్రమణదారులు తమ సామగ్రితో బయటకు వెళ్లిపోయారు. సోషల్ వెల్ఫేర్ శాఖ తాళాలు వేసి భవనాన్ని స్వాధీనం చేసుకుంది.

చిన్నారులపై అంగన్‌వాడీలు శ్రద్ధ చూపాలి

● సెక్టార్ సూపర్‌వైజర్ ఎ.అరుణకుమారి

పిట్లవానిపాలెం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లోని కార్యకర్తలు చిన్నారుల ఆలనాపాలనపై మరింత శ్రద్ధ చూపాలని చందోలు అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ ఎ.అరుణకుమారి అన్నారు. నడిమువారిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని చందోలు సెక్టార్ సూపర్‌వైజర్ ఎ.అరుణకుమారి సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పాల్గొన్నారు.


కొమెరపూడి గ్రామం

కొమెరపూడి
ఉపాధ్యాయులకు నిలయం

- గ్రామంలో 90 మంది వరకు ఉపాధ్యాయులు
- యువతకు ఉపాధ్యాయ వృత్తిపై మక్కువతోనే..

సత్తెనపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఒకే ఇంటిలో ఇద్దరు, ముగ్గురు ఉపాధ్యాయులు కూడా ఉన్నారు. ఉపాధ్యాయవృత్తిలో ఉన్న వారి తల్లిదండ్రులంతా ఎక్కువగా వ్యవసాయ కూలీలు, చిన్న వ్యాపారాలు చేసుకొనేవారే. సాధారణ ,దిగువ, మధ్య తరగతి వారు నివసించే ఈ గ్రామంలో రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద ముస్లింలు ఎక్కువగా ఉన్నారు. ప్రతి డీఎస్సీలోను ముస్లింపాలెంకు చెందిన యువతీ యువకులు ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికవుతున్నారు. కొమెరపూడిలో 10వ తరగతి వరకు చదువుకొని అక్కడి నుంచి సత్తెన పల్లిలో ఇంటర్ పూర్తి చేసి బీఈడీ పూర్తిచేసిన వారిలో ఎక్కువ మంది ఉపాధ్యాయవృత్తిలోనే ఉన్నారు. ప్రభుత్వం ఉర్దూ టీచర్ పోస్టులను ఎక్కువగా భర్తీ చేస్తుండటంతో.. ఇంటర్ మీడియట్‌లో రెండవ లాంగ్వేజ్‌గా 'ఉర్దూ' తీసుకుని, ఇంటర్ అనంతరం బీఈడీలో కూడా ఉర్దూ పూర్తిచేసి ఉపాధ్యాయవృ త్తిలో స్థిర పడుతున్నారు. దీంతో ఆ గ్రామంలో చదువుకునే యువత దృష్టి ఉపాధ్యాయ వృత్తిపైనే పడింది. పది మంది వరకు విశ్రాంత ఉపాధ్యాయులు ఉన్నారన్నారు.

బోధనపై మక్కువతో..

గ్రామంలోని ఐదారు ముస్లిం కుటుంబాల్లో భార్యాభర్తలు, అన్నదమ్ములు, అక్కా చెల్లెలు, అన్నా చెల్లెలు ఉపాధ్యాయులుగా ఉండటం విశేషం. ఈ తరం వారు వారిని చూసి బోధనపై ఎక్కువగా మక్కువ పెంచుకున్నారు. టీటీసీ, బీఈడీ లాంటి చదువులు చదివి బోధనలో స్థిర పడుతున్నారు. ముస్లింపాలెంలో ఎక్కువగా యువతీ యువకులు ఉపాధ్యాయ కొలువు పొందాలన్నదే లక్ష్యంగా చదివారు. నాలుగు వందల వరకు ముస్లిం కుటుంబాలు ఉంటే మూడు వందల కుటుంబాల్లో ఒక రిద్దరు డిగ్రీలు, పీజీలు, టీటీసీ, బీఈడీ చేశారంటే నాటి యువతలో బోధనపై వారికి ఎంత మక్కువ ఉందో అర్థమవుతుంది.

'మాతృ దేవోభవ, పితృ దేవోభవ, ఆచార్య దేవో భవ' అంటారు. జన్మనిచ్చిన తల్లిదండ్రుల తరువాత స్థానం ఉపాధ్యాయులది. అలాంటి ఉపాధ్యా యులకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది సత్తెనపల్లి మండలంలోని కొమెరపూడి. ఈ గ్రామంలో ఎక్కువ మంది ఉపాధ్యాయులుగా స్థిరపడ్డారు. 90 మంది వరకు ఉంటారు. పేద కుటుంబాల్లోని వ్యక్తులు చదువుల తల్లిని నమ్ముకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగారు. 'ఒక ఇంజనీరు తప్పు చేస్తే తాను నిర్మించిన బ్రిడ్జి మాత్ర మే కూలిపోతుంది. ఉపాధ్యాయుడు తప్పు చేస్తే సమాజమే పెడదారి పడుతుంది' అనేది లోకోక్తి. బాధ్యతాయుతంగా ఉంటున్న ఈ ఉపాధ్యాయులు ఈ గ్రామానికే వన్నె తెస్తున్నారు.


కొమెరపూడి జడ్పీ హైస్కూల్

ఎంతో గర్వంగా ఉంది



మా తండ్రి ఉపాధ్యాయునిగా పని చేశారు. నేను కూడా ఉపాధ్యాయ వృత్తిపై మక్కువతో బీఈడీ పూర్తి చేసిన అనంతరం డీఎస్సీలో ఉపాధ్యాయురాలిగా ఎంపికై క్రోసూరు మండలం అనంతవరం పాఠశాలలో పని చేస్తున్నాను. ఉపాధ్యాయ వృత్తి ద్వారా భావి భారత పౌరులను తీర్చిదిద్దే అవకాశం లభించటం సంతోషంగా ఉంది. మా గ్రామంలో ఉన్నంత మంది ఉపాధ్యాయులు బహుశ ఎక్కడ ఉండరేమో. ఈ విషయాన్ని మేము బయట ఎక్కడైనా చెప్పుకోవాలన్నా ఎంతో గర్వంగా ఉంటుంది.

-షేక్ రజియా బేగం, సెకండరీ గ్రేడు టీచర్, అనంతవరం

ఎందరికో ఓనమాలు నేర్పిన పాఠశాల : జీ సదాశివరెడ్డి, దొడ్లేరు



ఉపాధ్యాయ వృత్తిలో గౌరవం ఎక్కువగా లభిస్తుంది. ఉపాధ్యాయ వృత్తిపై మక్కువతో బీఈడీ పూర్తి చేసి డీఎస్సీలో ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాను. క్రోసూరు మండలం దొడ్లేరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్నాను. కొమెరపూడికి జిల్లా పరిషత్ హైస్కూల్ గుండె కాయ లాంటిది. నా లాగా ఎంద రికో ఓనమాలు నేర్పి ఉద్యోగులుగా తీర్చిదిద్దింది.

తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు



మా గ్రామంలో ఉపాధ్యాయ ఉద్యోగం చేసే వారి సంఖ్య ఎక్కువ. వీరే కాకుండా ఇతర ఉద్యోగస్తులు కూడా ఉన్నారు. వీరందరినీ కొమెరపూడి హైస్కూల్ ఉపాధ్యాయులు తీర్చిదిద్దారు. హైస్కూల్ చదువులు అయిపోయిన తర్వాత బయట చదువుకొని ఉద్యోగాలు సంపాదిస్తున్నారు. ఇది చాలా సంతోషం.

యర్రా వెంకటేశ్వరరావు, పాలకేంద్రం అధ్యక్షుడు, కొమెరపూడి

ఏ ఊరిలో లేరు : దేవరకొండ వెంకటరావు, మాజీ సర్పంచ్, కొమెరపూడి



మా గ్రామంలో ఉన్నంత మంది ఉద్యోగులు ఏ ఊరిలో ఉండరు. ఎక్కువ మంది ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు. అందులో ముస్లింపాలెంలోని యువతీ యువకులు ఎక్కువగా ఉన్నారు. ఇంకా సచివాలయ ఉద్యోగులు, మిలటరీలో పని చేసే వారు, పోలీసు శాఖలో పని చేసే వారు కూడా ఉన్నారు. ఈ విషయాన్ని మేము బయట చెప్పకోవాలంటే ఎంతో గర్వంగా ఉంటుంది.

ఐదుగురినీ బీఈడీ చదివించారు : ఎస్‌ఎం రెహ్మాన్, సెకండరీ గ్రేడ్ టీచర్, ఫణిదం

మానాన్న ఉపాధ్యాయుడు. మేము ఐదుగురు సంతానం. ముగ్గురు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు. అందరినీ బీఈడీ చదివించారు. ముగ్గురూ ఉపాధ్యాయులుగా పని చేస్తున్నాం. ఒక అమ్మాయి కూడా సెకండరీ గ్రేడ్ టీచర్. తక్కువ జీతంతో మానాన్న కష్టపడి చదివించాడు. క్రమశిక్షణగా చదివి ఉపాధ్యాయ ఉద్యోగాలను మెరిట్‌లో సాధించినందుకు సంతోషంగా ఉంది.



రైతు కూలీ కుటుంబం మాది : షేక్ హజరాబీ, సెకండరీ గ్రేడ్ టీచర్, కంకణాలపల్లి

రైతు కూలీ కుటుంబం మాది. మా ఇంట్లో ఐదుగురు మగపిల్లలు, ముగ్గురు ఆడపిల్లలు. తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకుంటూ మమ్మల్ని కష్టపడి చదివించారు. నేను బీఈడీ పూర్తి చేసి 2008లో డీఎస్సీలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఎంపికయ్యాను. సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి పాఠశాలలో పని చేస్తున్నాను. గ్రామంలోని ముస్లిం పిల్లలంతా ప్రభుత్వ హైస్కూల్‌లో చదివి మంచి స్థాయికి ఎదిగాం. ప్రభుత్వ ఉద్యోగాలు పొందటానికి ముస్లిం పాలెంలో యువత ఎక్కువగా పోటీ పడతారు.



ఆధునికంగా.. అమరావతి

(5వ పేజీ తరువాయి)

విమానాశ్రయానికి ఒక ఫీడర్ కేటాయించి విద్యుత్ అవసరాలు తీరుస్తున్నామన్నారు. పెదన సబ్‌స్టేషన్‌తో ఆక్వా పరిశ్రమకు మేలు జరుగుతుందన్నారు. శ్రీకాకుళం సబ్‌


సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి హాజరైన ప్రజలు

స్టేషన్‌తో కొబ్బరి పరిశ్రమకు ఊతం లభిస్తుందని చెప్పారు. బేతంచర్ల సబ్ స్టేషన్‌తో నంద్యాల హార్టికల్చర్ హబ్ అభివృద్ధి చెందుతుందని, గ్రీన్‌ఎనర్జీకి ఊతం లభిస్తుందని చెప్పారు.

చెలరేగిపోతున్న వైసీపీ సోషల్ మీడియా

వైసీపీ సోషల్ మీడియా మూకలు అడ్డూ అదుపు లేకుండా చెలరేగిపోతున్నాయని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. నా గురించి, హోమ్ మంత్రి అనిత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఆయన పిల్లలు, న్యాయమూర్తుల కుటుంబాల గురించి విచ్చలవిడిగా పోస్టులు పెట్టి ఇష్టారాజ్యంగా దాడులు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. వైసీపీకి వాత పెట్టడం ఖాయమన్నారు. రౌడీలు, గూండాలు ఏ ముసుగులో ఉన్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. విచ్చలవిడిగా పోస్టులు పెడుతూ భావప్రకటనా స్వేచ్ఛ అంటే ఊరుకోబోమని తేల్చిచెప్పారు. ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టి 11 సీట్లకు కుదించి ఇంట్లో కూర్చోబెట్టినా వారికి బుద్ధి రాలేదన్నారు. రాజకీయ విమర్శలు మాని వ్యక్తులు, కుటుంబాలపై తప్పుడు ప్రచారాలు చేస్తే ప్రతిఒక్కరిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ జగన్ పాడు చేసిన అమరావతి అభివృద్ధికి శ్రీకారం చుట్టామని తెలిపారు. అండర్ గ్రౌండ్ కేబుల్‌తో అమరావతిని అద్భుత నగరంగా తీర్చి దిద్దాలని చంద్రాబాబు భావిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, గుమ్మడి సంధ్యారాణి, విద్యుత్ శాఖ చీఫ్ సెక్రటరి కే.విజయానంద్, ఏపీ జన్కో ఎండీ చక్రధర్‌బాబు, గుంటూరు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎమ్మెల్యే గళ్లా మాధవి, జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా అధికారులు, రాజధాని రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆత్మాభిమానానికి ప్రతీక అమరావతి : కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

సభలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ అమరావతి తెలుగు ప్రజల ఆత్మాభిమానానికి ప్రతీక అన్నారు. చంద్రబాబు దార్శనికతతోనే అమరావతికి రూ.15 వేల కోట్ల గ్రాంటు వచ్చిందన్నారు. 2 వేల కోట్లతో రైల్వే లైను, ఈఎస్‌ఐ ఆస్పత్రి వచ్చిందని తెలిపారు. అమరావతిని విధ్వంసం చేసిన వైసీపీకి ఆ ప్రాంతంలో ఒక్క ఓటు కూడా పడకూడదని తెలిపారు. గత ప్రభుత్వం కక్ష సాధింపుతో పీపీఏలు రద్దు చేసి, 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై వేల కోట్ల భారం మోపిందన్నారు.

అభివృద్ధి పథంలో : మంత్రి కందుల దుర్గేశ్

సభలో గుంటూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఖజానా మొత్తాన్ని ఖాళీ చేసి పోతే 4 నెలల్లో కూటమి ప్రభుత్వం అద్భుతాలు చేస్తుందన్నారు. రాష్ట్రం అభివృద్ధి పథాన దూసుకుపోతోందన్నారు. నాణ్యమైన విద్యుత్ ద్వారా వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు, ప్రజల జీవన ప్రమాణాలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు.

ఏడాదిలో ప్రాజెక్టులు పూర్తి : మంత్రి గొట్టిపాటి

సభలో ఇందనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో ఇంధనరంగం నిర్వీర్యమైపోయిందన్నారు. ఇప్పుడు ప్రారంభించిన ప్రాజెక్టులతోపాటు, శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులను ఏడాదిలోపు పూర్తి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన విద్యుత్ అందిస్తామన్నారు. అండర్‌గ్రౌండ్ విద్యుత్ లైన్లతో ప్రపంచస్థాయి నగరంగా అమరావతిని తీర్చిదిద్దుతామన్నారు.

రేషన్ దందాపై మంత్రి నజర్

- సత్తెనపల్లి, మేడికొండూరు, వట్టిచెరుకూరుల్లో తనిఖీలు
- రైస్‌మిల్లుల్లో 1000 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం గుర్తింపు

(5వ పేజీ తరువాయి)

మహిళలతో నిత్యావసరాల ధరల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత ఆయన మిల్లుల తనిఖీలకు బయల్దేరడంతో మిల్లర్లు, అధికారులు ఖంగుతిన్నారు. అచ్చంపేటరోడ్డులోని అంజనేయ ట్రేడర్స్ రైస్ మిల్లుకు తాళాలు వేయడంతో వాటిని పగలగొట్టి మంత్రి, లోపలకు వెళ్లారు. మిల్లులో పెద్ద ఎత్తున రేషన్ బియ్యం నిల్వలు, రేషన్ బియ్యం గోతాలను గుర్తించారు. మంత్రి రాకను తెలుసుకున్న మిల్లు నిర్వాహకులు పాత బిల్లులను, కొన్ని రేషన్ బ్యాగ్‌లను తగలబెట్టగా వాటిని ప్రత్యక్షంగా చూసిన మంత్రి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దఎత్తున నిల్వలు ఉన్నా ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వని అధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని జేసీకి ఆదేశాలు జారీ చేశారు.

రైస్ మిల్లులోనే ఎండీయూ వాహనం

మేడికొండూరు: మేడికొండ మండలం పేరేచర్ల పరిధిలోని మూడు రైస్ మిల్లులను మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం అకస్మిక తనిఖీ చేశారు. ఒక రైస్ మిల్లులోని బియ్యం పరీక్షకు పంపగా అవి చౌక బియ్యమేనని తేలడంతో స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయాలని ఆదేశించారు. శ్రీలక్ష్మీ గణపతి రైస్ మిల్లులో ఇంటింటికి రేషన్ సరఫరా చేసే వాహనం(ఏపీ 37 టీక్యూ 7793) ఉండడంతో ఆయన ఆశ్చర్యపోయారు. డ్రైవర్‌ను అరెస్టు చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకోవాలని పోలీసులను ఆదేశించారు. అనంతరం వెంకటేశ్వర ట్రేడర్స్ అనే రైస్ మిల్లు సిబ్బంది మంత్రి రాకను ఊహించి సీఎంఆర్ రైస్ బ్యాగ్ ట్యాగ్‌లను దహనం చేయగా గమనించి యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేయాలని పోలీసులను మంత్రి ఆదేశించారు. ఆ మిల్లులో బియ్యాన్ని పరీక్షలకు పంపగా రేషన్ బియ్యం అనే తేలడంతో స్వాధీనం చేసుకుని మిల్లును సీజ్ చేశారు. విఘ్నేశ్వర రైస్ మిల్లులో టార్చ్ లైట్ వెలుగులో బియ్యాన్ని, రికార్డులను పరిశీలించారు. ఈ తనిఖీల్లో మంత్రి గుంటూరు, పల్నాడు జేసీలు బార్గవ్ తేజ, తూనికలు, కొలతల శాఖ అధికారులు, మేడికొండూరు తహశీల్దార్ కళ్యాణి, పౌరసరఫరాల శాఖ అధికారరులున్నారు. వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడులోని శ్రీవల్లి రైస్ మిల్లులో తనిఖీలు చేపట్టిన మంత్రి 12 టన్నుల రేషన్ బియ్యాన్ని గుర్తించారు.


పేరేచర్ల : వెంకటేశ్వర ట్రేడర్స్ రైస్ మిల్లులో బియ్యం తనిఖీ చేస్తున్న మంత్రి మనోహర్

పేదల బియ్యం ఇతర దేశాలకు

ఆకస్మిక తనిఖీల అనంతరం మంత్రి మనోహర్ విలేకర్లతో మాట్లాడుతూ పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయన్నారు. పేద ప్రజల వద్ద తక్కువ ధరకు వ్యాపారులు బియ్యాన్ని కొని ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారన్నారు. రేషన్ బియ్యం సరఫరాను రాజమార్గంగా చేసుకుని కొంత మంది ఎక్కడికక్కడ మాఫియాలాగా తయారయ్యారన్నారు. వీటిని ప్రక్షాళన చేస్తామన్నారు. తనిఖీల్లో ప్రాథమికంగా వెయ్యి మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం దొరికిందని, మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. సత్తెనపల్లిలోని ఐదు మిల్లుల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు.


సత్తెనపల్లి : ఓ దుకాణం వద్ద టీ తాగుతూ ధరలపై మహిళను ప్రశ్నిస్తున్న రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

భూమితో బంధం తెగుతోంది



- 70 శాతం మంది సాగుకు దూరమయ్యారు
- యుద్ధానికి వెళ్లే సైనికుడిలా రైతు వెన్నుతట్టే వాళ్లు కావాలి
- ఐదు వేల ఎకరాలకు ఒక సైంటిస్ట్ కావాలి
- పెట్టుబడి.. దిగుబడి మధ్య ఉన్న అంతరం తగ్గించాలి
- వ్యవసాయానికి పూర్వ వైభవం రావాలి
- ప్రముఖ రైతు శాస్త్రవేత్త నెక్కంటి సుబ్బారావు

ఫిలిప్పీన్స్ ప్రెసిడెంట్ అధికారిక నివాసంలో నెక్కంటి సుబ్బారావు నిలువెత్తు ఫోటో ఇప్పటికీ కనిపిస్తుంది. కరువు వచ్చి ప్రపంచం ఆకలితో చచ్చిపోతుంటే సాగులో శాస్త్రవేత్తలు చేయలేని అద్భుతాలు రైతుగా ఆయన చేసి పలువురుకి పట్టెడన్నం పెట్టినందుకు దక్కిన గౌరవ మది. 1967లో వచ్చిన హరిత విప్లవానికి ఆయనే నాంది అయ్యారు. ఇంటర్నేషనల్ రైస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ తయారు చేసిన ఐఆర్-8 వరి వంగడానికి ఆయనే బ్రాండ్ అంబాసిడర్‌గా మారి ఆకలితో లక్షలాది మంది చనిపోయిన పశ్చిమ బెంగాల్ సహా, యావత్ భారతావనికి కడుపు నింపారు. సుబ్బారావు సాగు స్ఫూర్తికి మంత్ర ముగ్ధులైన 50 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు, దేశ, విదేశాల వ్యవసాయ సైంటిస్టులు పశ్చిమగోదావరి జిల్లాలోని ఆచంట వచ్చి వెళ్లారు.

గుంటూరు సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికీ ప్రపంచంలో ఏ కొత్త వరి వంగడం వచ్చినా ఆయన దగ్గరకు పరిశీలనకు వస్తుంది. 90 పదుల వయసులో కూడా ఆయన 25 ఎకరాల్లో వరి సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. 16 నేషనల్ అవార్డు లు, 3 ఇంటర్నేషనల్ అవార్డులు పొందిన ఆయన ఇప్పటికీ రోజుకు 16 గంటలు వ్యవసాయం గురించే మాట్లాడతారు. అంత పెద్ద వయస్సులో నడిచొస్తున్న వ్యవసాయ యూనివర్సిటీలా అనిపించే నెక్కంటి సుబ్బారావును ఆచార్య ఎన్ జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఈ ఏడాది ఉత్తమ రైతు పురస్కారానికి ఎంపిక చేసింది. గురువారం ఎన్‌జీరంగా 124వ జయంతిని పురస్కరించుకుని ఆయనను ఘనంగా సన్మానించి, పురస్కారం అందజేసింది. ఈ సందర్భంగా ప్రముఖ రైతు శాస్త్రవేత్త నెక్కంటి సుబ్బారావు ఇప్పటి సాగు పరిస్థితులపై 'ఆంధ్రజ్యోతి' తో మాట్లాడారు.

ప్రస్తుత సాగు పరిస్థితి ఎలా ఉంది ?

సుబ్బారావు: ఇప్పుడు సాగు పరిస్థితులు అంత ఆశాజనకంగా లేవు. నూటికి 70 శాతం మంది పొలాలు కౌలుకు ఇచ్చి విదేశాలకు, ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతున్నారు. ఎక్కువ భూమి కౌలు రైతుల చేతిలోనే ఉంది. భూమికీ యజమానితో ఉన్న బంధం తెగిపోతోంది. దాన్ని పునరుద్ధరించాలి. కారణం ఏదైనా కావచ్చు కానీ సాగు విస్తీర్ణం పడిపోతే రాష్ట్రం దుర్భిక్షం అవుతుంది. మిగిలిన అన్ని రంగాల్లో పురోగతి సాధించి ఇక్కడ ఫెయిల్ అయితే ఆ నష్టం ఏమి చేసినా పూడ్చలేము.

ఎక్కువ మంది సాగుకు దూరం కావటానికి కారణం?

నెక్కంటి : కారణాలు అనేకం. కొందరు పిల్లలు దగ్గరకు అని వెళ్లిపోతున్నారు. కొందరు సాగు గిట్టుబాటు కావడం లేదని దూరం అవుతున్నారు. పెట్టుబడికీ దిగుబడికీ మధ్య పెద్ద అంతరం ఏర్పడింది. నేను సాగులో అడుగుపెట్టినప్పుడు అసలు మాకు ఎరువుల సంగతి తెలియదు. గోదావరి నుంచి వచ్చే నీళ్లు ఎర్రగా ఒండ్రు మట్టి తో వచ్చేవి. ఫిలిప్పీన్స్ తయారు చేసిన ఐఆర్-8 వరి వంగడం మొదట కోయంబత్తూరు వెళ్ళింది. అక్కడ మిగిలిన నారు తెచ్చి నేను సాగు చేశాను. వాళ్ళు ఎరువులు, మందులు ఎక్కువగా కొట్టారు. దాంతో ఎకరాకు 25 బస్తాలు దిగుబడి వచ్చింది. నేను ఏమి వాడలేదు ఎకరాకు 40 బస్తాలు దిగుబడి వచ్చింది. అది చూసే దేశం అంతా నా చుట్టూ తిరిగింది. ఇప్పుడు ఎంత ఎక్కువ ఎరువులు, పురుగు మందులు వాడితే అంత మంచి రైతు అంటున్నారు. ఈ ధోరణి మారాలి. భూమి తల్లిని కాపాడాలి.అవసరం ఉన్నా లేకున్నా వాడుతున్న రసాయన ఎరువులు, మందుల వల్ల నేల నిస్సారం అవుతుంది. ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలు పెరగాలి.

సాగు శాతం పెంచాలంటే?

సుబ్బారావు: అది ప్రభుత్వం చేతుల్లో మాత్రమే ఉంది. అనేక రంగాలను ప్రోత్సహిం చటానికి ఏవిధంగా అయితే సబ్సిడీ లు ఇస్తున్నారో ఇక్కడ కూడా అంతకంటే ఎక్కువ ఇవ్వాలి. సాగుచేసే రైతులను ప్రోత్సహించాలి. పండించిన పంటకు మద్దతు ధర ఇవ్వాలి. ఆ మద్దతు ధర నిర్ణయం రైతుల సమక్షంలో జరగాలి.ఏసీ గదుల్లో కూర్చొని నిర్ణయించే మద్దతు ధర వల్ల రైతుకు కష్టానికి తగిన ఫలితం రాదు. ప్రస్తుతం 30 వేల ఎకరాలకు ఒక వ్యవసాయ అధికారి ఉ న్నారు. ఆయన ఎంత భూమిని పరీక్షించగలడు. ఎంత మందికి సరైన సమయంలో సల హాలు ఇవ్వగలడు. ఆ విధానం మారాలి. ప్రతి 5 వేల ఎకరాలకు ఒక శాస్త్రవేత్త కావాలి. యుద్ధానికి వెళ్లే సైనికుడ్ని వెన్ను తట్టి పంపినట్లు రైతును అలా వెన్ను తట్టే వాళ్ళు కావాలి. రైతు చెయ్యి ఎప్పుడూ పైన ఉంటేనే రాష్ట్రం సుభిక్షం అవుతుంది. అందరూ సాఫ్ట్‌వేర్, హార్డ్ వేర్లు అయితే అన్నం ఎవరు పెడతారు. కాబట్టి మన ఆలోచన ధోరణిలో కొంత మార్పు రావాలి. తల్లిదండ్రులు వాళ్ళ పిల్లలు రైతులు అయినందుకు గర్వపడే రోజులు రావాలి.

వైసీపీకి సుచరిత గుడ్ బై

- జగన్‌కి చెప్పి వచ్చిన మాజీ హోంమంత్రి
- తాడికొండకు కొత్త ఇన్‌చార్జ్ కోసం అన్వేషణ



గుంటూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వైసీపీకి మాజీ హోం మంత్రి మేకతోటి సుచరిత గుడ్ బై చెప్పారు. రెండు రోజుల క్రితం వైసీపీ అధినేత, మాజీ ముఖ్య మంత్రి జగన్‌ను కలిసిన సుచరిత తాను ఇక రాజకీయాల్లో కొనసాగలేనని చెప్పినట్లు తెలిసింది. ఆరోగ్యం కూడా అంతగా సహకరించడం లేదని అందువల్ల తాడికొండ ఇన్‌చార్జ్ బాధ్యతల నుంచి తప్పకుంటున్నట్లు తెలియజేశారు. గత ఎన్నికల్లో ఆమె తాడికొండ నుంచి పోటీ చేసి ఓడిపో యిన విషయం తెలిసిందే. కొద్ది రోజుల క్రితం ఆమె జనసేనలో చేరబోతున్నట్లు ప్రచారం జరగ్గా ఆమె ఖండించారు. గత ఎన్నికల్లోనే ఆమె పోటీకి అంతగా సుముఖత చూపలేదు. వాస్తవానికి ఆమె సొంత నియోజకవర్గం ప్రత్తిపాడు అనే చెప్పవచ్చు. ఆ నియోజకవర్గం నుంచే ఆమె 2009, 2012, 2014, 2019 ఎన్నికల్లో పోటీ చేశారు. 2014 ఎన్నికల్లో మినహా మిగతా మూడు ఎన్నికల్లో గెలుపొందారు. 2019 ఎన్నికల్లో విజయం సాధించిన తరువాత ఆమెను జగన్ తన కేబినెట్‌లోకి తీసుకొని కీలకమైన హోం శాఖను అప్పగించాడు. మంత్రి పదవిలో రెండున్నరేళ్ళ పాటు కొనసాగినప్పటికీ తనకు ఎటువంటి పవర్ లేకుండా చేశారని అప్పట్లోనే ఆమె మనస్థాపానికి గురయ్యారు. పైగా పూర్తి కాలం మంత్రిగా పనిచేసే అవకాశం కూడా ఇవ్వకుండా మధ్యలోనే తప్పించి ఇదే జిల్లా నుంచి విడదల రజనీకి మంత్రి పదవి కట్టబెట్టటంతో ఆమె అవమానానికి గురయ్యారు. 2024 ఎన్నికల్లో ప్రత్తిపాడు నుంచి తిరిగి పోటీ చేయాల్సిన సుచరిత అక్కడ నుంచి పోటీ చేసేందుకు అంగీకరించలేదు. మంత్రిగా ఆమె ఉన్న సమయంలో కుటుంబీకుల వ్యవహారం మూలంగా నియోజకవర్గంలో సొంత పార్టీలోనే వ్యతిరేకత రావటంతో తిరిగి అక్కడ పోటీ చేసినా గెలవలేననే భయంతో వెనుకంజ వేసింది. అదే సమయంలో తాడికొండ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ఉండవల్లి శ్రీదేవి జగన్‌కు ఝలక్ ఇచ్చి పార్టీని వీడటంతో సుచరితను తాడికొండకు వలస తీసుకెళ్ళటం జరి గింది. తాడికొండలో ఓటమి అనంతరం ఆమె నియో జకవర్గానికే కాకుండా పార్టీ కార్యక్రమాలకు కూడా దూరంగా ఉంటున్నారు. ఇటీవల రెండు పర్యాయాలు జగన్ జిల్లా పర్యటనకు వచ్చినప్పటికీ ఆమె ఆ కార్య క్రమాల్లో పాల్గొనలేదు. ఈ నేపథ్యంలో ఆమె బుధ వారం జగన్‌ను కలిసి రాజకీయాల నుంచి తప్పుకుం టున్నట్లు తెలిపారు. తాడికొండకు కొత్త ఇన్‌చార్జ్ కోసం జగన్ అన్వేషిస్తున్నారు.

ఇష్టారాజ్యం

(5వ పేజీ తరువాయి)

ఈ వ్యాపారం ఏ విధంగా జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఆ మిల్లులోని బియ్యం మొత్తాన్ని మరొక రైస్‌మిల్లుకు తరలించి ఎం.రాజేష్‌గుప్తా, ఎం.శ్రీనివాసులు, చిరంజీవి అనే వ్యక్తులపై అధికారులు 6ఏ కింద కేసు నమోదు చేశారు. కాగా తాళ్లూరు మండలం బొద్దికూరపాడు వద్ద గురువారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని విజిలెన్స్ సీఐ రామారావు నేతృత్వంలో పట్టుకున్నారు. 400 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

అనేక అక్రమాలు వెలుగులోకి..

ఇలా జిల్లావ్యాప్తంగా ఈ వారం రోజుల వ్యవధిలోని మూడువేల బస్తాలకుపైగా అధికారులు పట్టుకున్నారు. చీమకుర్తిలో వంద బస్తాలు, మద్దిరాలపాడులో వంద బస్తాలతో పాటు కనిగిరి, కంభం, మార్కాపురం, దోర్నాల సమీపంలో ఆటోల్లో తరలిస్తున్న బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రేషన్ పంపిణీ ప్రారంభం నాటి నుంచి పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రేషన్ షాపులను తనిఖీలు చేయగా అనేక అక్రమాలు వెలుగులోకి రావడంతో ఆ షాపులపై 6ఏ కేసులు నమోదు చేశారు. జిల్లావ్యాప్తంగా ఆ విధంగా ఈ వారంరోజుల వ్యవధిలోనే 20కిపైగా షాపులపై కేసులు నమోదు అయ్యాయంటే ఈ వ్యాపారం ఏ విధంగా జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. జిల్లావ్యాప్తంగా రేషన్ అక్రమ వ్యాపారంలో కొత్త, పాత వారు కలిసి యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారు.

అక్రమ మైనింగ్‌లో జిలెటిన్ స్టిక్స్?

(5వ పేజీ తరువాయి)

విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు అడ్డుకుని ఎక్స్‌కవేటర్‌ను, లారీ స్వాధీనం చేసుకున్నారు. మార్కాపురం మైనింగ్ శాఖకు చెందిన అసిస్టెంట్ జియాలజిస్ట్ పోలిరెడ్డి, టెక్నికల్ అధికారి బాలరాజు గురువారం రెవెన్యూ అధికారులతో కలసి అక్రమ మైనింగ్ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. అక్కడ ఎంత పరిమాణంలో తెల్లరాయి ఉన్నదీ లెక్కించి కేసు నమోదు చేశారు. లారీ, ఎక్స్‌కవేటర్‌కు రూ.50 వేలు అపరాధ రుసుం విధించారు. అక్రమంగా వెలికి తీసిన వైట్‌క్వాట్జ్ 40 మెట్రిక్ టన్నులు ఉంటుందని లెక్కించి రెవెన్యూ అధికారులకు స్వాధీనం చేశారు. ఆతరువాత ఆ వైట్ క్వాట్జ్‌ను వేలం వేస్తామని పోలిరెడ్డి తెలిపారు. మండలంలో అక్రమ మైనింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. వారివెంట ఆర్ఐ నాగరాజు, వీఆర్వో ఉన్నారు.

క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలి

(5వ పేజీ తరువాయి)

అవగాహన దినం సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్యాన్సర్ బారిన పడకుండా ముందుగా ఇంటి వద్దనే స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి ఆ వ్యాధి బారి నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన వైద్యం పొందడం ద్వారా వ్యాధిని నివారించవచ్చని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ నోటి క్యాన్సర్, సాధారణ క్యాన్సర్, నివారణపై ఈనెల 14న జరిగే ఇంటింటి సర్వేలో 18 ఏళ్లు దాటిన వారందరూ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ నోడల్ అధికారి డాక్టర్ జీ.భగీరధి, ఒంగోలు మెడికల్ కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ తిరుమలరావు, హెల్ప్ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ.సాగర్, ఫ్లోరోసిస్ ప్రాజెక్టు అధికారి డాక్టర్ అనిల్‌కుమార్, డెమో శ్రీనివాసులు పాల్గొన్నారు.



పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోని జీవీఆర్ కంపెనీ

జీవీఆర్ ఫ్యాక్టరీలో రెండో రోజూ కొనసాగిన ఐటీ సోదాలు

సింగరాయకొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న వైసీపీ మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు చెందిన జీవీఆర్ రొయ్యల ప్రాసెసింగ్, ఎక్స్‌పోర్ట్స్ కంపెనీలో ఐటీ అధికారులు రెండో రోజైన గురువారమూ విస్తృతంగా సోదాలు చేశారు. రికార్డులన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. కంపెనీ లావాదేవీలకు సంబంధించిన కొన్ని కంప్యూటర్లలోని కీలక హార్డ్ డిస్కులను ఆదాయపు పన్నుశాఖ అధికారులు సీజ్ చేసినట్లు సమాచారం.

చలివేంద్ర కొండపై చిన్నారి మృతదేహం

- చంపి పడేసి ఉంటారని అనుమానాలు
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు
- దర్శి ప్రాంతంలో కలకలం



చలివేంద్ర కొండపైన చిల్లచెట్లలో దొరికిన చిన్నారి మృతదేహం

దర్శి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా దర్శి మండలంలోని చలివేంద్ర కొండపై ఏడు నెలల పసిపాపను చంపి పడేసిన దారుణ ఘటన గురువారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. పొదిలి ప్రాంతానికి చెందిన ఓ మహిళ బుధవారం రాత్రి ఆ పాపను తీసుకొని చలివేంద్ర కొండకు వచ్చింది. అక్కడ కొలువుదీరిన వెంకటేశ్వరస్వామి వద్ద పూజలు చేసి రాత్రి అక్కడే నిద్ర చేయాలని నిర్ణయించుకుంది. ఆలయ నిర్వాహకులు ఆమెకు అక్కడ అందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

గురువారం ఉదయం తెల్లవారుజామున నాలుగున్నర గంటలకు ఆ మహిళ నిద్రలేచి తన పాపతో తిరుగు ప్రయాణమైంది. ఇంత చీకట్లో ఎక్కడకు వెళ్తావని నిర్వాహకులు అడగ్గా, తన భర్త ఫోన్ చేయడంతో వెళ్తున్నానని ఆమె చెప్పింది. దీంతో వారు మిన్నకుండిపోయారు. ఆ తర్వాత ఉదయం 7 గంటలకు కొండ మధ్యలో మెట్ల వద్ద చిన్నారి మృతదేహం కనిపించింది. సత్రంలో పనిచేసే మహిళ పొదల్లో ఉన్న చిన్నారిని చూసి కొండపైన ఉన్న వారికి సమాచారం ఇచ్చారు.

అక్కడ పరిశీలించగా చిన్నారి తల్లి బట్టలు కూడా అక్కడే ఉన్నాయి. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించగా, దర్శి ఎస్‌ఐ ఎం.మురళీ హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

డీఎస్సీ ఉచిత శిక్షణకు 10న అభ్యర్థులకు స్క్రీనింగ్ పరీక్ష

- ఒంగోలులో మూడు కేంద్రాల ఏర్పాటు
- అధికారులతో ఏర్పాట్లపై డీఆర్వో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో చినఓబులేషు

ఒంగోలు నగరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు అభ్యర్థుల ఎంపికను ఈ నెల 10వ తేదీన చేపట్టనున్నారు. ఇందుకోసం స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించేందుకు అధికారులు ఒంగోలులోని మూడు కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. డీఎస్సీ పోటీ పరీక్షకు హాజరయ్యే ఎస్సీఎస్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో కోచింగ్ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కోచింగ్ సెంటర్లను కూడా ఎంపిక చేసింది. అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం దరఖాస్తులు కోరగా మొత్తం 13,982 దరఖాస్తులు రాగా వీటిలో జిల్లా నుంచి 583 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారికి ఈ నెల 10వ తేదీన స్థానిక వెంగముక్కపాలెం రోడ్డులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల, పేస్ ఇంజనీరింగ్ కళాశాల, రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ కంప్యూటర్ ఆధారిత విధానంలో ఈ స్క్రీనింగ్ పరీక్ష జరుగుతుంది. ఇందుకోసం హాజరయ్యే విద్యార్థులు తమ హాల్‌టికెట్లను జ్ఞానభూమి వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ ఎస్.లక్ష్మానాయక్ కోరారు. ఎంపిక పరీక్షకు సంబంధించిన అన్న వివరాలను అభ్యర్థుల సెల్‌ఫోన్‌లకు మెసేజ్‌ల ద్వారా తెలియజేశామని ఆయన తెలిపారు. హాల్‌టికెట్‌తో పాటు ఒరిజనల్ ఆధార్‌కార్డుతో హాజరుకావాలన్నారు. ఈనేపథ్యంలో గురువారం సాయంత్రం స్థానిక డీఆర్వో కార్యాలయంలో డీఆర్వో చిన్నఓబులేషు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్ష నిర్వహించే నిర్దిష్ట సమయానికి అరగంట ముందు మాత్రమే అభ్యర్థులను పరీక్ష హాలులోకి అనుమతించాలన్నారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహిస్తున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా జనరేటర్ సదుపాయాన్ని కూడా ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. సాంకేతిక సమస్యలను తల్తెకుండా సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, వైద్యశిబిరం, పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీడీ లక్ష్మానాయక్, జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి జగన్నాథరావు, డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్, శింగరాయకొండ సీఐ హజరత్తయ్య, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు గరికమిట్టలో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ

- గ్రానైట్‌తో సుందరంగా నిర్మించిన సీతారామంజనేయస్వామి ఆలయం



గ్రానైట్‌రాయితో నిర్మించిన నూతన ఆలయం



ప్రతిష్ఠామూర్తుల ఊరేగింపులో భక్తులు

చీమకుర్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పట్టణంలోని గరికమిట్టలో నూతనంగా నిర్మించిన సీతారామంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలను ఘనంగా నిర్వహించటానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. శుక్రవారం ఉదయం 7:15 గంటలకు విగ్రహాల ప్రతిష్ఠ, 7:45కు ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేయనున్నారు. సీతారామంజనేయస్వామి ఆలయం మొత్తం పూర్తిగా గ్రానైట్ రాయితో సుందరంగా నిర్మించారు. దీంతో ఆలయం చూపరులను విశేషంగా ఆకట్టుకుంటుంది. మధ్యాహ్నం 12గంటలకు స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని రమణీయంగా జరుపనున్నారు. అయిలావఝ్ఝల రామకృష్ణశాస్త్రి, శివకుమార్‌శాస్త్రిల పర్యవేక్షణలో ప్రతిష్ఠాకార్యక్రమాలను నిర్వహిస్తారు. అనంతరం అన్నదానాన్ని జరపటానికి దేవస్థాన కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. కాగా మహోత్సవాల్లో భాగంగా గురువారం విశేషహోమాలు, మహస్నపనము, ధాన్యాధివాసం, పుష్ప శయాధివాసం, గ్రామోత్సవాన్ని జరిపారు.

సచివాలయ ఏఎన్‌ఎంలకు ఉద్యోగోన్నతులు కల్పించాలి



డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో పని చేస్తున్న ఏఎన్ఎం గ్రేడ్-3లకు ఉద్యోగ్నోతులు కల్పించేందుకు వెంటనే ఫైనల్ సీనియారిటీ జాబితాను ప్రకటించాలని ఏపీ విలేజ్ అండ్ వార్డు హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. గురువారం ఒంగోలులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సురేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని సబ్‌సెంటర్లలో ఎంపీహెచ్ఏ(ఎఫ్) ఖాళీలను ప్రకటించాలని, కొంతమంది ఏఎన్ఎంలకు సర్వీస్ మార్కులతో పాటు బోనస్ మార్కులు 15మార్కులు కలిశాయని, ఆ మార్కులు ఎందుకు కలిశాయో వివరణ ఇప్పించాలని కోరారు. సచివాలయాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ జీపీఎస్ ఇంటింటి మ్యాపింగ్ సర్వేలు చేయాలని వత్తిడి చేస్తున్నారని, దీనిని రద్దుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తాళ్ళూరి వెంకటేశ్వర్లు, జి.నాగేశ్వరరావు, వై.సుభాషిణి, కాలం సుబ్బారావు, స్వర్ణలత, వై.సరస్వతి, డి.అనిత, పి.పద్మావతి, ఎన్.సౌభాగ్యం, ఎం.గీత, బి.లక్ష్మి, జె.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంపై సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు

- యువతిని విచారించిన పోలీసులు

ఒంగోలుక్రైం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఆయన కుటుంబ సభ్యులపై సోషల్ మీడియాలో ఓ యువతి అసభ్యకరమైన పోస్టింగ్‌లు పెట్టారు. ఈ మేరకు జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి ముత్యాల కళ్యాణ్ ఒంగోలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల ఒకటో తేదీన కేసు నమోదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు పోస్టింగ్‌లు పెట్టింది ఓ మహిళగా గుర్తించారు. తెలంగాణ రాష్ట్ర నల్గొండకు చెందిన పెద్దిరెడ్డి సుధారాణిని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. అనంతరం 41 సీఆర్‌పీసీ ప్రకారం నోటీసులు ఇచ్చి పంపించినట్లు ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు.

నేడు ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ, కార్పొరేషన్‌లో పనిచేస్తున్న సెంకడరీ గ్రేడ్ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ శుక్రవారం ఉదయం పది గంటలకు స్థానిక కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో జరుగుతుందని డీఈవో కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

అన్ని పాఠశాలలకు ప్రహరీలు నిర్మించాలి



నిత్యావసరాలు పరిశీలించి మాట్లాడుతున్న పద్మావతి

మేదరమెట్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రహరీలు లేని పాఠశాలలకు ప్రహరీలను నిర్మించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని రావినూతల, దైవాలరావూరు, పమిడిపాడు, కొరిశపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కుర్రవానిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. రావినూతలలో పాఠశాల రికార్డులను పరిశీలించి పాఠశాలకు హాజరుకాని విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజన పథకం హాజరును పరిశీలించి, పిల్లలతో కలిసి భోజనం చేశారు. కుకింగ్ ఏజెన్సీలను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్యలక్ష్మి, ఎంఈవోలు ఎల్.పున్నయ్య, బీవీ రఘావులు, సీఐ మల్లికార్జునరావు, ఎస్‌డబ్ల్యూవో వీరాంజనేయులు, మహిళా కానిస్టేబుల్ శారద ఉన్నారు.



న్యూజిలాండ్ ప్రధాన మంత్రి తో ఎమ్మెల్యేలు ఏలూరి, నరేంద్రవర్మలు

న్యూజిలాండ్ ప్రధానితో ఏలూరి, వర్మ భేటీ

పర్చూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర తెలుగు అసోసియేషన్ న్యూజిలాండ్ ఎన్ఆర్ఐ టీడీపీ వారి అహ్వానం మేరకు న్యూజిలాండ్ వెళ్లిన పర్చూరు, బాపట్ల ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, నరేంద్ర వర్మ గురువారం అదేశ ప్రధాన మంత్రి క్రిస్టోఫర్ లక్సన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారితో ఏపీ సీఎం చంద్రాబు విజనరీ లీడర్ అని, ఆయన సారథ్యంలో ఏపీ అభివృద్ధి చెందుతుదని క్రిస్టోఫర్ తెలిపారు. ఏపీకి రావాలని ప్రధానిని ఏలూరి, నరేంద్ర వర్మ సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఇక్కడున్న వనరులను వివరించారు. కియా కార్లు ఏపీ నుంచి న్యూజిలాండ్‌కు వస్తున్నాయని కితాబిచ్చారు. అసోసియేషన్ నేతలు మద్దుకూరి దిలీప్, ఆశోక్ గోరంట్ల తదితరులు ఉన్నారు.

ఉపాధి నిధులతో గ్రామాల అభివృద్ధి

చినగంజాం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ నిధుల ద్వారా గ్రామాలు అభివృద్ధి చేసుకోవచ్చునని ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి అన్నారు. మండలంలోని చినగంజాం, కడవకుదురు, గొనసపూడి, సంతరావూరు గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా 2025-26 సంవత్సరానికి సంబధించి పనులు గుర్తింపుపై గురువారం గ్రామసభలు నిర్వహించారు. గ్రామసభల్లో ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను, సదుపాయాలను రైతులకు, కూలీలకు వివరించారు.



కేజీబీవీలో కుళ్లిన కూరగాయలను పరిశీలిస్తున్న చైర్మన్

మెనూ ప్రకారం భోజనం అందించకుంటే చర్యలు

- ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి

వేటపాలెం/చీరాలటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించకుంటే సంబంధీకులపై చర్యలు తప్పవని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి స్పష్టం చేశారు. చీరాల, వేటపాలెంలో పరిధి, ఈపూరుపాలెంలో ఎలిమెంటరీ స్కూల్, కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, దేశాయిపేటలోని ఎంఎల్ఎస్ పాయింట్, ఎండీఎం వాహనం, జాండ్రపేట హైస్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. కేజీబీవీ వంటగదిలో కుళ్లిన కూరగాయలు ఉండడం చూసిన ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడం లేదన్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. బాధ్యులకు నోటీసులు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ఏజెన్సీలు తమకు రావల్సిన బిల్లులు పూర్తిస్థాయిలో అందుకుంటూ, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించకుండా ఉండడం దారుణమన్నారు. పాలు, కూరగాయలు, చికెన్ తదితర పౌష్టికాహారాన్ని ఇవ్వకుండా రేట్లు పెరిగాయని చెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. ధరలు తగ్గితే బిల్లులు వెనక్కి ఇస్తారా అని ప్రశ్నించారు. వేటపాలెం హైస్కూల్లో 210 మంది విద్యార్థులు ఉంటే అందుకుగాను 2.10 కిలోల కందిపప్పు వేయాలి. అయితే అక్కడున్న సాంబారులో కనీసం కేజీకి మించి లేకపోవడం తన దృష్టికి వచ్చిందన్నారు. అవకతవకలకు పాల్పడినవారికి హెచ్చరికలతో పాటు నోటీసులు జారీ చేశారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు, కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.



కొబ్బరికాయ కొట్టి ఇంటిని ప్రారంభిస్తున్న యూట్యూబర్ శ్రీదేవి

యూట్యూబర్ పెద్ద మనసు

- పేదింటి మహిళ ఇంటి నిర్మాణానికి రూ.6.50లక్షల ఆర్థికసాయం
- గృహప్రవేశానికి హాజరైన శ్రీదేవి

మద్దిపాడు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండలం గార్లపాడు గ్రామంలో నిరుపేద మహిళ ముత్తనపల్లి రమణ ఇంటి నిర్మాణానికి వైజాగ్‌కు చెందిన ప్రముఖ యూట్యూబర్ ఎంఎస్.శ్రీదేవి ఆర్థిక సహాయాన్ని అందజేసి పెద్దమనసును చాటుకున్నారు. గత సంవత్సరం మండలంలోని పలు గ్రామాలలో పలువురు పేదలకు ఆర్థిక సహాయం అందజేసిన శ్రీదేవి గార్లపాడు పునరావాస కాలనీలోని రమణ పరిస్థితిని తెలుసుకున్నారు. ఆమె ఇంటి నిర్మాణానికి అయ్యే ఖర్చు రూ.6.50 లక్షలు తాను భరించి నిర్మాణ బాధ్యతను గ్రామ సర్పంచ్ దేవరపల్లి గంగిరెడ్డికి అప్పగించారు. ఆ ఇంటి నిర్మాణం పూర్తి కావడంతో గురువారం శ్రీదేవి దగ్గరుండి గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు శ్రీదేవి దాతృత్వానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగిరెడ్డి, గంగయ్య, కాలనీకి చెందిన పలువురు మహిళలు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

గుండ్లకమ్మలో ఈతకు వెళ్లి యువకుడి గల్లంతు

అద్దంకి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్నేహితులతో కలిసి సరదాగా ఈత కు వెళ్లిన యువకుడు తేలుకుట్ల నారాయణ, గుండ్లకమ్మ నదిలో గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం బట్లపల్లికి చెందిన తేలుకుట్ల నారాయణ, వేంపాడుకు చెందిన కావూరి ఫిలిప్, కొరిశపాడు మండలం బొడ్డువానిపాలెంకు చెందిన నేరేళ్ల వెంకటేష్, చిక్కాల భరత్‌నాయుడు గురువారం సాయంత్రం గుండ్లకమ్మ నదిలో తిమ్మాయపాలెం సమీపంలో ఊటబావుల వద్ద సరదాగా ఈతకు వెళ్లారు. తేలుకుట్ల నారాయణ గుండ్లకమ్మ నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మునిగిపోయాడు. ఫిలిప్ కూడా మునిగిపోతుండగా మిగిలిన ఇద్దరు కలిసి బయటకు లాగారు. విషయం తెలుసుకున్న సీఐ కృష్ణయ్య, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. కళ్ల ఎదుటే స్నేహితుడు మునిగిపోవడంతో తల్లడిల్లిపోయారు. నారాయణకు ఏడాది బాబు ఉండగా, భార్య నిండు గర్భిణి. విషయం తెలుసుకున్న కటుంబసభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకొని వెతుకుతున్నారు.

కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

వేటపాలెం(చీరాల), నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : రామన్నపేట సమీపంలోని కాలువలో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కన్పించింది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం అతని వయస్సు 45-50 సంవత్సరాల మధ్య ఉంటుందని, పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు చెప్పారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

- గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలింపు

పంగులూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భగవాన్‌రాజుపాలెం ఫ్లైవోవర్ సమీపంలో జాతీయ రహదారిపై ఆటో ఢీకొన్న ఘటనలో పల్లి సాంబశివరావు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఆటో డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తికి కూడా గాయాలయ్యాయి. అందిన సమాచారం మేరకు.. ఏలూరు జిల్లా నాగుల దేవరపాడు గ్రామానికి చెందిన పల్లి సాంబశివరావు గురువారం మధ్యాహ్నం విధి నిర్వహణలో భాగంగా హోండాయ్ కారులో ఒంగోలుకు వెళ్తున్నారు. మండలంలోని భగవాన్‌రాజుపాలెం ఫ్లైవోవర్ సమీపంలో కారుదిగి రోడ్డు మార్జిన్‌లో మూత్రవిసర్జనకు వెళ్లి వస్తున్న క్రమంలో అదే రహదారిలో ఒంగోలు వైపు వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాంబశివరావు తలకు గాయం కాగా, ఆటో డ్రైవర్, ఆటోలో ఉన్న మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ముగ్గురినీ చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సాంబశివరావుకు మెరుగైన వైద్యానికి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గాయపడిన ఆటో డ్రైవర్‌ను ఒంగోలుకు తరలించారు. రేణంగివరం పోలీసులు ఆటోను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాంబశివరావు పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం.

మహిళపై దాడి కేసు కొట్టివేత

అద్దంకి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మహిళపై దాడి చేసిన కేసు ను కొట్టివేస్తూ గురువారం అద్దంకి కోర్టులో తీర్పు చెప్పారు. సంతమాగులూరు మండలం సజ్జాపురానికి చెందిన మహిళ 2010 సెప్టెంబరు 27వ తేదీన పొలంలో పనిచేస్తుండగా అదే గ్రామానికి చెందిన ధూళిపాళ్ల అంజమ్మ, బాపయ్య, పావులూరి శ్రీమన్నారాయణతో పాటు మరో ఐదుగురు కలిసి దాడి చేశారు. దీనిపై అప్పట్లో సంతమాగులూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నేరం రుజువు కాకపోవడంతో గురువారం అసిస్టెంట్ స్పెషల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి కేసును కొట్టివేసినట్లు నిందితుల తరపున వాదించిన సీనియర్ న్యాయవాది నాదెండ్ల దశరథరామయ్య తెలిపారు.

కోలలపూడి పొలాల్లో మోటారు వైరు చోరీ

మార్టూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని కోలలపూడి గ్రామంలోని పొలాల్లో ఉన్న కరెంట్ మోటార్‌కు ఉన్న సర్వీసు వైరును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటన బుధవారం అర్ధరాత్రి జరిగింది. పొలాల్లో కూరగాయలు, మిరప తదితర పంటలు సాగులో ఉండగా ఇలా జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఉదయం నీరు పెట్టేందుకు వెళ్లగా వైరు దొంగిలించినట్లు రైతులు గుర్తించారు. సుమారు 20 మందికి పైగా రైతులకు చెందిన పొలాల్లో చోరీ జరిగినట్లు తెలిసింది.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

ఈపూరుపాలెం(చీరాలటౌన్),నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) :మాజీ హోంగార్డు భార్యను వేధిస్తుండడంతో ఆమె ఈపూరుపాలెం పోలీసులను ఆశ్రయించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే..

చీరాల మండలం కొత్తకావూరివారిపాలెంకు చెందిన పల్లపట్ల లక్ష్మికి సుమారు 9 సంవత్సరాల కిందట బాపట్ల మండలం మచ్చావారిపాలెంకు చెందిన హోంగార్డు శివ మల్లికార్జునరెడ్డితో వివాహం జరిగింది. ప్రస్తుతం వీరికి 04, 02 వయసు గల ఇద్దరు కుమార్తెలున్నారు. అయితే పెళ్లయిన కొద్దికాలం తరువాత భర్త మద్యానికి బానిసై భార్యను వేధించడం మొదలుపెట్టారు. కొంతకాలం తరువాత ఏమి జరిగిందో తెలియదు గానీ హోంగార్డు ఉద్యోగం కూడా పోయింది. తరచూ గొడవలు జరుగుతుండడంతో ఆరు నెలలుగా భార్య లక్ష్మీ పుట్టింటి వద్దే ఉంటోంది. నెలలు గడుస్తున్నా అతనిలో మార్పు రాకపోగా, కాపురానికి కూడా తీసుకు వెళ్లడం లేదు. దీంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో భర్త, కుటుంబ సభ్యుల మీద కేసు నమోదు చేశారు.

ఆధార్ సేవలు వినియోగించుకోండి

తహసీల్దార్ సింగారావు

పంగులూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పంగులూరు సచివాలయం-2లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని తహసీల్దార్ పీ సింగారావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని ఎస్టీ వర్గాలకు చెందిన ఎరుకల, యానాది కులాలకు చెందిన వారు ఆధార్ కేంద్రంలో కార్డులు తీయించుకోవాలని కోరారు.వీరితో పాటు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఆధార్ కార్డు సవరణలు, కొత్తగా ఆధార్ కార్డు తీయించుకునే అవకాశం ఉందన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆధార్ కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను తహసీల్దార్ పరిశీలించారు.

మాజీ ఎంపీపీ వీరబ్రహ్మం మృతి


వీరబ్రహ్మం

మక్కెనవారిపాలెం (సంతమాగులూరు), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మక్కెనవారిపాలెం గ్రామానికి మాజీ ఎంపీపీ కాశీపోగు వీరబ్రహ్మం (70) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. వీరబ్రహ్మం సంతమాగులూరు ఎంపీపీగా 2009 నుంచి 2014 వరకు పని చేశారు. అతనికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నారు. పలువురు నాయకులు వీరబ్రహ్మం మృతదేహానికి నివాళులర్పించారు.

శిథిలావస్థలో ఆర్టీసీ బస్టాండ్

- భవనం నుంచి ఊడుతున్న పెచ్చులు
- కంపుకొడుతున్న మురుగు నీరు
- ప్రాంగణంలో పెరిగిన ముళ్ల చెట్లు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు



కూలేందుకు సిద్ధంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్
పెచ్చులూడిన స్లాబు

పర్చూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు ఆర్టీసీ బస్టాండ్ శిథిలావస్థకు చేరుకుంది. భవనం దెబ్బతిని పెచ్చులు ఊడి ప్రయాణికులపై పడుతున్నాయి. అయినా పట్టించుకునేవారే లేరని ప్రయాణికులు వాపోతున్నారు. బస్సుల కోసం బస్టాండ్‌లో నిరీక్షించే సమయంలో ఏం ప్రమాదం జరుగుతోందోనని వారు భయపడుతున్నారు. ఇక్కడ విద్యుత్ సరఫరా కూడా అంతంతమాత్రంగానే ఉంది. తరచూ మరమ్మతులతో అంధకారంలో ఉండాల్సిన పరిస్థితి ఉంది. ఆవరణలో మురుగు నీరు నిలిచి తీవ్రమైన కంపు కొడుతోంది. ప్రాంగణం చుట్టూ ముళ్ల చెట్లు పెరిగిపోయాయి. రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. రాత్రి సమయాల్లో వచ్చిపోయే ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. పర్చూరు నియోజకవర్గ కేంద్రంతోపాటు, చుట్టుపక్కల ప్రధాన పట్టణాలకు కూడలి కావడంతో నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు పర్చూరు మీదుగా రాకపోకలు సాగించాల్సి ఉంది. దీంతో ప్రతి వాహనం బస్టాండ్ నుంచే రాకపోకలు చేయాల్సి ఉంది. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లాల్సిన వారు ఆర్టీసీ బస్టాండ్‌కు రావలిసిందే. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఆర్టీసీ బస్టాండ్ కూలేందుకు సిద్ధంగా ఉన్నా సంబంధిత అధికారులు మౌనంగా ఉండడం పై ప్రయాణికులు, ప్రజలు ఆగ్ర హం వ్యక్తం చేస్తున్నారు. మరోప క్క దీనికి చెందిన స్థలం కూడా ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకోవడం లేదు.


అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు

వైసీపీ పాలనలో నిర్లక్ష్యం

వైసీపీ పాలనలో ఆర్టీసీ బస్టాండ్ నిర్వహణ గాలికి వదిలేశారు. భవనం పెచ్చులూడి ప్రయాణికులు గాయపడుతున్నా కనీసం మరమ్మతులు కూడా చే యలేదని, పూర్తి నిర్లక్ష్యానికి గురైందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మరుగుదొడ్లు అధ్వానం

దూర ప్రాంతాల నుంచి బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులకు కనీస వసతులు కూడా లేవు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహిళల పరిస్థితి దయనీయంగా మారింది.

అభివృద్ధి చేస్తాం

పర్చూరు ఆర్టీసీ బస్టాండ్ పరిస్థితి తన దృష్టిలో ఉంది. బస్టాండ్ శిథిలావస్థకు చేరడంతో మరమ్మతులు చేసేందుకు ప్రతిపాదనలు పంపించాం. త్వరలో అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం.

- శ్యామల, ఆర్టీసీ డీఎం, చీరాల

ఎంపీడీవోకు అస్వస్థత

వేటపాలెం(చీరాల), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవో రాజే ష్‌బాబు అస్వస్థతకు గురయ్యారు. గుండె నొప్పితో ప్రై వేటు వైద్యశాలలో చేరారు. అనంతరం విజయవాడకు తరలించారు.

ప్రకృతి వ్యవసాయంతోనే మానవాళికి ఆరోగ్యం


కషాయాల తయారీని పరిశీలిస్తున్న ప్రాజెక్టు మేనేజర్ వాణిశ్రీ, అధికారులు

అద్దంకిటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంతోనే మానవాళికి ఆరోగ్యం అని బాపట్ల జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాణిశ్రీ అన్నారు. గురువారం మండలంలోని గోవాడ గ్రామంలో వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకట కృష్ణ, వ్యవసాయ సిబ్బందితో కలిసి పర్యటించారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ మందులు వాడకుండా దేశవాళీ వరి రకాలను పండిస్తున్న నరిశెట్టి రమేష్‌బాబు పొలాలను పరిశీలించారు. రత్నచోడి, జమ్ముతావి, ఇన్నపుసాంబ, చంద్రగుండు, కాలాబట్టి, కాలా భట్, కొల్లం, మధు మాలతి వంటి పది రకాల పురాతన దేశీ రకాలను రమేష్ బాబు తన పది ఎకరాలలో పండిస్తూ ఇతర రైతులకు విత్తనాలను సరఫరా చేయడం, రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా పలు రకాల కషాయాలను వాడి పంటలు పండిస్తూ ఆదర్శంగా నిలిచారన్నారు. ఘన జీవామృతం, వేప కషాయం, అగ్నాస్త్రం, బ్రహ్మాస్త్రం, వంటి కషాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విచ్చలవిడిగా ఎరువులు, పురుగుమందులు వాడకం వలన భూమి ఆరోగ్యంతో పాటు ప్రజలు ఆరోగ్యంగా ఉంటార ఏవో వెంకటకృష్ణ కోరారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కోకిల, వనజా రాణి, పద్మలత, నరేంద్ర పాల్గొన్నారు.


గుండ్లకమ్మ నదిలో చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్

కార్తీక స్నానాలకు గుండ్లకమ్మలో ఏర్పాట్లు

అద్దంకి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గుండ్లకమ్మ నదిలో కార్తీక స్నానాలు, దీక్షధారుల స్నానాలకు వీలుగా ఏర్పాట్లను చేశారు. అద్దంకి పట్టణంలోని నర్రావారిపాలెం తెలుగు యువత ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్‌తో ఆ ప్రాంతాన్ని చదును చేయించారు. నర్రావారిపాలెం నుంచి గుండ్లకమ్మ నదికి వెళ్లే రోడ్డులో పూర్తిగా చెట్లు పెరగడంతో పాటు వ్యర్థాలను పోసి ఉండడంతో చదును చేయించి గుండ్లకమ్మ నదిలో స్నానాలకు వీలుగా ర్యాంప్‌ను కూడా ఏర్పాటు చేయించారు. దీంతో కార్తీక స్నానాలు చేసే భక్తులతో పాటు మండల దీక్ష తీసుకున్నవారు స్నానాలు చేసేందుకు సౌకర్యవంతంగా మారింది. తెలుగు యువత నేతలు దొప్పలపూడి ప్రసాద్, నర్రా శివకృష్ణ, బిల్లపాటి రామాంజనేయులు, నర్రా సుబ్బయ్య దగ్గరుండి పనులు చేయించారు.


సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న టీడీపీ నేత రామారావు, వార్డు సభ్యులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రూ.40లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మేదరమెట్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్లలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో విద్యార్థులు, ప్రజలకు ఉపయోగపడే రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మన్నె రామారావు అన్నారు. గురువారం మేదరమెట్లలో రూ.40లక్షల విలువైన సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో ఇంకా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మన్నె దుర్గారావు, గ్రామ నాయకులు మన్నె శ్రీనివాసరావు, బత్తుల శ్రీనివాసరావు (డాల్ఫిన్ శ్రీను), పఠన్ సర్దార్ ఖాన్, వడ్లమూడి శివ, మన్నె యుగంధర్, పుట్టా బుల్లియ్య, ఓగూరి వెంకట్రావు, రేగుల రామాంజనేయలు, పలువురు వార్డు నెంబర్లు, మహిళలు పాల్గొన్నారు.

భద్రతా వారోత్సవాలతో ప్రమాదాలు దూరం


భద్రతా వారోత్సవాల్లో పాల్గొన్న అధికారులు

బల్లికురవ. నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గనులలో భద్రతా వారోత్సవాలు నిర్వహించడం వలన ప్రమాదాలు దూరం అవుతాయని తనిఖీల బృందాల కన్వీనర్‌లు తెలిపారు. గురువారం మండల పరిధిలోని వీర్ల కొండ వద్ద కృష్ణసాయి ఎక్స్‌పోర్ట్స్, సాయి లక్ష్మీ, వీకె గ్రానైట్, సాయి శ్రీనివాస్ గ్రానైట్ క్వారీలలో భద్రతా వార్సోవాలను నిర్వహించారు. తనిఖీ బృందం సభ్యులు భద్రతా చర్యలను పరిశీలించి, నివారణపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో తనిఖీల టీం కన్వీనర్‌లు బ్రహ్మయ్యబాబు, ఫక్రుద్దీన్, క్వారీల మేనేజర్లు, యజమానులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల శాఖ కార్యవర్గం ఏకగ్రీవం


ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

చినగంజాం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) చినగంజాం మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం ఏకగ్రీవంగా జరిగింది. ఎన్నికల అధికారిగా యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.భిక్షాలు బాబు, పరిశీలకులుగా రాష్ట్ర కౌన్సిలర్ పీ.సురేష్, వెలుగొండారెడ్డి ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించినట్లు జిల్లా గౌరవాధ్యక్షుడు సిద్ధం పాపారావు తెలిపారు. యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడిగా మెట్టు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా షేక్ నాయబ్‌రసూల్, గౌరవ అధ్యక్షుడిగా ఎస్.సూర్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడిగా సీహెచ్ వెంకట్, టి.సౌజన్య, కోశాధికారి కోటయ్య, మహిళా కార్యదర్శి కే.సునీత, జిల్లా కౌన్సిలర్‌లు కే.నాగరాజు, జి.అంకమ్మ, పీ.పోతురాజు, పి.ఆదిలక్ష్మి, కార్యదర్శులు డి.నారాయణ, చిలకా కుమార్, కొండేపి రామారావు, రాజాబాబు, పిచ్చుక శ్రీనివాసరావు, ఎస్.అంకయ్య, ఎం.విజయకుమారి, ఎస్.ధనలక్ష్మీ, యూ.సాంబశివరావు, బీవీ రమేష్‌బాబు, మహిళా కన్వీనర్ పర్వతరెడ్డి సరళ, మహిళా కోకన్వీనర్ ఎస్.భవానీకుమారి, మహిళా కమిటీ సభ్యులు పి.హిమవంతేశ్వరి, స్వర్ణలత, ఎస్.అనంతలక్ష్మీ, కే.నాగలక్ష్మీ తదితరులు ఎంపిక కాగా వారందరితో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు ప్రమాణ స్వీకారం చేయించారు.


సభ్యత్వ కార్డును అందజేస్తున్న టీడీపీ నేత గౌరీఅమర్‌నాథ్

ప్రాంతీయ పార్టీలలో టీడీపీకి ప్రత్యేక స్థానం

- సభ్యత్వ నమోదులో గుర్తింపు తెండి : గౌరీ అమర్‌నాథ్

కొత్తపేట(చీరాల), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రాంతీయ పార్టీలలో టీడీపీకి ప్రత్యేక స్థానం ఉంది. అధికార పక్షంగా ఉన్నా, ప్రతి పక్షంగా ఉన్నా ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు సాగడం అందుకు కారణమని టీడీపీ నేత గౌరీ అమర్‌నాథ్ అన్నారు. గురువారం నియోజకవర్గ పరిధిలో పలుచోట్ల జరుగుతున్న టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కొన్నిచోట్ల సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఆయా సందర్భాల్లో ఆయన మాట్లాడుతూ టీడీపీకి కార్యకర్తలే మూల స్తంభాలన్నారు. పార్టీ శ్రేణులు సమిష్టిగా సభ్యత్వ నమోదులో ముందుండి, చీరాల నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు తేవాలని కోరారు. కార్యక్రమంలో ఆయా ప్రాంతాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలి

అద్దంకిటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పెరిగిన ధరలకు అనుగుణంగా మున్సిపాలిటీలో పని చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికుల జీతాలను పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందర్ అన్నారు. గురువారం సుందరయ్య భవనంలో అద్దంకి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మజుందర్ మాట్లాడుతూ 2018కి ముందు పారిశుధ్య కార్మికులతో పాటు ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు ఉండేవని, ప్రస్తుతం వారికంటే తక్కువ జీతాలు తీసుకుంటూ చాలీచాలని జీతాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమస్యను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. 10వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం అద్దంకి మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ అధ్యక్షుడిగా శామ్యూల్, కార్యదర్శిగా జాన్, సభ్యులుగా మార్కు, మారుతి, రవితేజ, అశోక్, ప్రేమ్ మరికొంతమందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకుడు తిరుపతిరెడ్డి, వెంకటేశ్వర్లు, జాషువా పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ శేషగిరిరావు

మార్టూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నివారణపై అవగాహన కార్యక్రమాలపై గురువారం స్టేషన్‌లో హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన పోస్టర్‌ను సీఐ ఎం.శేషగిరిరావు ఆవిష్కరించారు. వ్యాధి లక్షణాలు, నివారణకు తీసుకోవల్సిన వైద్యం, జాగ్రత్తలపై హెల్ప్ సంస్థ తీసుకుంటున్న చర్యలను సీఐ అభినందించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ సాగర్, బృందం సభ్యులు కే దుర్గా, రూతు, సల్మా, ప్రమీల, రమ్య, సరోజిని పాల్గొన్నారు.

24న చినగంజాంలో బైబిల్ పరీక్ష

చినగంజాం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని అంబేడ్కర్‌నగర్‌లోని పెద్ద చర్చి వద్ద ఈ నెల 24వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు బైబిల్ పరీక్ష నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు ఎం.మేషక్‌బాబు గురువారం ప్రకటనలో తెలిపారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా స్థానిక అంబేడ్కర్‌నగర్ పెద్దలు, అంబేడ్కర్ నగర్ ఎంప్లాయీస్ అసోసియేషన్, యూత్ సభ్యుల సహాయ సహకారాలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 20లోపు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని వారు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. విజేతలకు క్రిస్మస్ పండుగ రోజు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 9849714691 నెంబరుని సంప్రదించాలని మేషక్‌బాబు కోరారు.

కేన్సర్ నివారణకు ముందస్తు పరీక్షలు

డాక్టర్ బాలరాజేశ్వరి

పంగులూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కేన్సర్‌ను గుర్తించేందుకు క్రమం తప్పకుండా ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి బాలరాజేశ్వరి అన్నారు. జాతీయ కేన్సర్ నివారణ దినం సందర్భంగా మండలంలోని పంగులూరు, మల్లవరం గ్రామాలలో పాఠశాల చిన్నారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య వంతమైన ఆహారం తీసుకోవడం, మత్తు పానియాలకు దూరంగా ఉండడం, 18 ఏళ్ల వయస్సు నిండిన వారు వైద్య పరీక్షలు చేయించుకోవడం ఆచరించాలన్నారు. రొమ్ముల్లో గడ్డలు, ఆహారం మింగడంలో ఇబ్బంది, దగ్గు, పుట్టు మచ్చలలో మార్పులు రావడంవంటి లక్షణాలుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యులు కృష్ణకుమార్, హెచ్‌ఎం రమాదేవి, సీహెచ్‌వో భారతి, అనూరాధ, హరిబాబు, స్టాఫ్ నర్స్ రాఘవమ్మ, పద్మావతి, జానకి, బిందుపావని, ఆరోగ్య కార్యకర్త సతీష్, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

బల్లికురవ : కేన్సర్‌ను తరిమికొట్టేందుకు ప్రజలు సహకరించాలని గుంటుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రమీజ్‌అహ్మద్ కోరారు. గురువారం కేన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వైద్యులు రవితేజ, సిబ్బంది పాల్గొన్నారు.

మేదరమెట్ల : ముందుగా వ్యాధి నిర్ధారణ పరీక్షలతో కేన్సర్‌ను దూరం చేయవచ్చని మేదరమెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు చిట్టిబాబు అన్నారు. గురువారం మేదరమెట్లలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమలో డాక్టర్ నిఖీలా రెడ్డి, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ మనోజ్, డాక్టర్ అక్షిత, డాక్టర్ రాజశేఖర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

చినగంజాం : పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.విజయభాస్కరరావు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది చినగంజాం గ్రామంలో కేన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పొగాకు ఉత్పత్తులు మానుకోవాలని, మత్తు పానీయాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన ఆహారం తీసుకోవాలని విజయభాస్కర్ సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఝాన్సీరాణి, హెల్త్ సూపర్‌వైజర్ చిరంజీవి, ల్యాబ్ టెక్నీషియన్ శ్యామ్, హెల్త్ అసిస్టెంట్ ఎస్.మురళి, మహేష్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్టూరు : ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బందికి, రోగులకు కేన్సర్‌పై రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ కేన్సర్‌ను ఎలా గుర్తించాలి, వైద్య సేవలను వివరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కోటేశ్వరరావు, మాదాల సాంబశివరావు, డాక్టరు భానుచంద్రనాయుడు, డాక్టర్లు పాల్గొన్నారు.

ఇంకొల్లు : పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం కేన్సర్ నిర్మూలనా దినం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేపడుతున్నట్లు వైద్యాధికారులు టీ అంజలి, భానుప్రకాశరావు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కోటేశ్వరరావు, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


మల్లవరంలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు